సంపుటి : 9
సంచిక : 338
ఆదివారం
30 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

ఏపీలో మెడికల్ కోర్సుల

## ఫీజుల పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన వైద్యారోగ్యశాఖ



**అమరావతి, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో వైద్యవిద్య (మెడికల్) కోర్సుల ఫీజులను ప్రభుత్వం సవరించింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ఫీజులను 10 శాతం, పీజీ కోర్సుల ఫీజును 15 శాతం పెంచుతూ వైద్యారోగ్యశాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెంచిన రుసుములు 2026-27 విద్యా సంవత్సరానికి వర్తించనున్నాయి.


**ఎంబీబీఎస్ ఫీజులు:**
కన్వీనర్ కోటా: రూ. 18,150
మేనేజ్‌మెంట్ కోటా: రూ. 14.52 లక్షలు
ఎన్నారై కోటా: రూ. 43.56 లక్షలు

**బీడీఎస్ ఫీజులు:**
కన్వీనర్ కోటా: రూ. 15,730
మేనేజ్‌మెంట్ కోటా: రూ. 4.84 లక్షలు
ఎన్నారై కోటా: రూ. 14.52 లక్షలు

పీజీ & సూపర్ స్పెషాలిటీ కోర్సుల ఫీజులు:
పీజీ కన్వీనర్ కోటా: రూ. 5.71 లక్షలు
పీజీ మేనేజ్‌మెంట్ కోటా: రూ. 11.42 లక్షలు
పీజీ ఎన్నారై కోటా: రూ. 66.12 లక్షలు
సూపర్ స్పెషాలిటీ కోర్సులు: రూ. 19.38 లక్షలు

ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట..

# ఇప్పుడొక మాట



- గిరిజన ప్రాంతాల్లో 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం
- రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- గత పాలనలో జే బ్రాండ్లు, బలవంతపు మత మార్పిడులతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపణ
- సెప్టెంబర్ 2న అనకాపల్లికి గోదావరి జలాలు, 31న వెలిగొండకు కృష్ణా జలాలు విడుదల
- పాడేరు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**పాడేరు, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల విషయంలో గత పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించి, ఇప్పుడు వాటిని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అరకు నియోజకవర్గంలోని గన్నెలలో శనివారం జరిగిన 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం వారి నైజానికి నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం అయితే, సదరు నియోజకవర్గ ఇన్చార్జిదే బాధ్యత... వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్ ఉండదు అని జగన్ వైసీపీ నేతలను హెచ్చరించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించారని చంద్రబాబు ఆరోపించారు. 'జే బ్రాండ్లు' పేరుతో కల్తీ మద్యం అమ్మి వేల మంది ప్రాణాలతో చెలగాటమాడారని, ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే గ్రూప్-1 పరీక్ష పత్రాలను ఒక ఎలక్ట్రీషియన్, అటెండర్‌తో దిద్దించి అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. ఇక తన పర్యటన ముఖ్య ఉద్దేశమైన 'సంజీవని' ప్రాజెక్టు వివరాలను సీఎం వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజల చెంతకే వైద్యం అందించే ఈ ప్రాజెక్టు, ఆరోగ్య రంగంలో తదుపరి స్థాయి విప్లవమని అభివర్ణించారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల మెరుగుదలకు రూ.250 కోట్లతో 'ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామని, త్వరలో అన్ని మండలాల్లో జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డ్రోన్ల ద్వారా మిగతా .. 2లో..

తమది నాటే సంస్కృతే కానీ,

# నరికేది కాదు

ఏపీ గ్రీన్ కమిటీ చైర్మన్ నాగబాబు



**మంగళగిరి, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టం చేశారు. హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి-వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు మిగతా .. 2లో..

శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ

## వినియోగించుకోవడం లేదు

వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి




**శ్రీశైలం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ దానిని ఉపయోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 71 శాతం వరకు నీటి నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ... సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన నిలదీశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వెంటనే నీటిని ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలని రాయలసీమ, మిగతా .. 2లో..

2022లో సకల శాఖల మంత్రి నాపై భౌతికదాడి చేశారు..

## జగన్‌కు తెలిసినా ప్రేక్షకపాత్ర వహించారు

వైసీపీలో తనకు ఎదురైన అవమానాలపై విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ



**ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యసభ మాజీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయి రెడ్డి రాజకీయంగా పెను దుమారం రేపారు. వైసీపీలో ఉన్నప్పుడు తనకు ఎదురైన పరిస్థితులు, అవమానాలను వివరిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై నిప్పులు చెరుగుతూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను విడుదల చేశారు. తనపై "నమ్మకద్రోహి" అంటూ వైసీపీలోని ఓ వర్గం దుష్ప్రచారం చేయిస్తున్నందునే ఈ లేఖ రాయాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ లేఖలో ఆయన చేసిన ఆరోపణలు, వెల్లడించిన విషయాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

**సజ్జల ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్**

"నేనే గనక నమ్మకద్రోహిని అయితే, ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని సీబీఐ, ఈడీ చార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌గారికి నమ్మకస్తుడిననే ఒకే ఒక్క కారణంతో ప్రతి చార్జిషీట్‌లో నన్ను ఏ-2గా చేర్చారు. జగన్‌గారు 16 నెలలు జైల్లో ఉంటే, నేను 15 నెలలు జైల్లో ఉన్నాను. నమ్మకద్రోహం నా రక్తంలో ఉంటే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని" మిగతా .. 2లో..

ఎవరూ హైదరాబాద్ రావద్దు, రెండు రోజుల్లో

## నేనే గుంటూరు వస్తా

ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉందని అంబటి రాంబాబు వెల్లడి



**హైదరాబాద్, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తన ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా స్పందించారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా తన గుండెలో రెండు బ్లాకులు గుర్తించారని, వైద్యుల బృందం విజయవంతంగా స్టెంట్లు వేసి చికిత్స పూర్తి చేసిందని ఆయన తెలిపారు. తనను పరామర్శించేందుకు ఎవరూ హైదరాబాద్ రావద్దని, రెండు రోజుల్లో తానే గుంటూరుకు తిరిగి వస్తానని, అక్కడే అందరం కలుసుకుందామని పార్టీ శ్రేణులకు, మిగతా .. 2లో..

ఏపీలో పాల సేకరణ

## ధర పెంచిన విజయ డెయిరీ



**విజయవాడ, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** పాడి రైతులకు విజయ డెయిరీ శుభవార్త అందించింది. పాల సేకరణ ధర పెంచుతున్నట్లు ప్రకటించింది. పాడి రైతుల నుంచి సేకరించే పాలకు లీటరుకు రూ.3 చొప్పున పెంచుతున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఉన్న ధర రూ.85ను రూ.88కి పెంచుతున్నట్లు ఎండీ ఈశ్వరరావు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అమరావతిలో

## 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

రాష్ట్రంలో 6 ప్రత్యేక అకాడమీలు ప్రారంభించాం : కొల్లు రవీంద్ర



**అమరావతి, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌ను క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'స్పోర్ట్స్ సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పీవీ సింధు, పుల్లెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖ క్రీడాకారుల అకాడమీలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి కనీసం మిగతా .. 2లో..

బొప్పరాజు తీరు

## అనుమానం కలిగిస్తోంది

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ తీరుపై మంత్రి అనగాని ఆగ్రహం



**అమరావతి, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వ్యవహారశైలిపై రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన ఉద్యోగుల సమస్యల అజెండాతో కాకుండా, ఒక స్పష్టమైన రాజకీయ అజెండాతో పనిచేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య సత్సంబంధాలను చెడగొట్టేలా బొప్పరాజు అతిపోకడలు ఉన్నాయని మంత్రి మండిపడ్డారు. శనివారం మంత్రి అనగాని మీడియాతో మాట్లాడుతూ, "ఉద్యోగుల సమస్యల అజెండాగా బొప్పరాజు పనిచేస్తున్నారా? లేక పొలిటికల్ అజెండాతో పనిచేస్తున్నారా?" అని సూటిగా ప్రశ్నించారు. చర్చల సమయంలో ఉద్యోగులను రెచ్చగొట్టేలా ఆయన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన బకాయిలను కూడా మిగతా .. 2లో..


రాష్ట్రాన్ని నాశనం చేయడమే

## జగన్ సంకల్పం

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**అమరావతి, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ కొనసాగించిన విధ్వంసాన్ని భరించలేకే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆ పార్టీని దారుణంగా ఓడించారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమర్శించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడమే జగన్ ఏకైక సంకల్పమని... అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై ప్రశ్నించే సత్తా లేక కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికే మీడియా ముందుకు వచ్చి విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించడానికి ఎంతో అవకాశం ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలకు జగన్ ఎందుకు రావడం లేదని రామ్మోహన్ నాయుడు నిలదీశారు. తన పార్టీ నేతలకు ఒక డైరెక్షన్ ఇవ్వడం కోసం, ఉనికిని కాపాడుకోవడం మిగతా .. 2లో..




తెలంగాణ ఉద్యమకారుల

## రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత : రేవంత్



**హైదరాబాద్, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ అయింది. కమిటీ సభ్యులు కేశవరావు, కోదండరామ్, రాములునాయక్, మోతె శోభన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీలతో జరిపిన సంప్రదింపుల వివరాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేశారు. ఉద్యమకారుల గుర్తింపు కసరత్తును జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం వారికి సూచించారు. ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు మిగతా .. 2లో..

కష్టంగా మారిన 229 మృతదేహాల గుర్తింపు..

## నేపాల్‌లోనే ఖననం

**ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆకస్మిక వరదలు సృష్టించిన విలయంతో నేపాల్‌లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. చిత్వాన్ జిల్లాలో లభ్యమైన 229 గుర్తు తెలియని మృతదేహాలను అధికారులు అక్కడే ఖననం చేశారు. అవి పూర్తిగా దెబ్బతిని, కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. మృతదేహాల నుంచి వచ్చే దుర్వాసన, ఇతర వ్యాధులు ప్రజలకు వ్యాపించకుండా ఉండేందుకు వాటిని ఖననం చేయాలని నిర్ణయించుకున్నట్లు చిత్వాన్ జిల్లా భద్రతా కమిటీ వెల్లడించింది. మొత్తం 233 మృతదేహాలు లభ్యమవ్వగా వాటిలో నాలుగు మాత్రమే గుర్తించారని.. మిగిలినవి గుర్తుపట్టలేని స్థితిలో పూర్తిగా కుళ్లిపోయాయని అధికారులు పేర్కొన్నారు. ఖననం చేయడానికి ముందు అన్ని మృతదేహాల నుంచి డీఎన్ఏ నమూనాలను మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఇప్పుడొక మాట

మారుమూల ప్రాంతాలకు మందులు, వ్యాక్సిన్లు పంపడంతో పాటు రక్త నమూనాలను ల్యాబ్‌లకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని వివరించారు. గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం ఐదు సూత్రాల ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నామని, 1.60 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. అరకు కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించి, హోమ్‌స్టేల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహించి గిరిజనులకు ఆదాయ మార్గాలు పెంచుతామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాల కోసం తీసుకొచ్చిన జీఓ నంబర్ 3ని గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సుప్రీంకోర్టు రద్దు చేసిందని, త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయం తెస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపైనా చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను, సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నరికేది కాదు

ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం, రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమశైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వినియోగించుకోవడం లేదు

నెల్లూరు జిల్లా రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ఉద్దేశమా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించినా ప్రభుత్వం మౌనంగా ఉండటం వెనుక ఉన్న దురుద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి నీటిని ఎడాపెడా తరలించుకుపోతుంటే, ఏపీ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని కాకాణి మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల కోసం చంద్రబాబు ఏపీ రైతుల జీవితాలను తాకట్టు పెడుతున్నారా అని ప్రశ్నించారు. సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్లే మొదటి పంటకే సాగునీరు అందక నెల్లూరు జిల్లా రైతాంగం ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.

# ప్రేక్షకపాత్ర వహించారు

అని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. 2024 ఎన్నికల తర్వాత కూడా తనకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో ఏ-5గా, కాకినాడ సీపోర్టు కేసులో ఏ-2గా తనను చేర్చారని, కానీ ఈ రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో "సకల శాఖల మంత్రి" అయిన సజ్జల పేరు ఒక్క చార్జిషీట్‌లో కూడా లేకపోవడం గమనార్హమన్నారు. జగన్‌కు వెన్నుపోటు పొడుస్తూ, టీడీపీతో కలిసి ఎలా పనిచేయాలో, కేసులు లేకుండా ఎలా చూసుకోవాలో ఆ "కోటరీ నాయకుడికి" తెలిసినంత తనకు తెలియదని ఎద్దేవా చేశారు.

**ప్లీనరీలో భౌతిక దాడి.. జగన్ ప్రేక్షకపాత్ర**

2022లో మంగళగిరిలో జరిగిన పార్టీ ప్లీనరీలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నేరుగా భౌతికంగా దాడి చేశారని, ఈ విషయం జగన్‌కు తెలిసినా ప్రేక్షకపాత్ర వహించారని విజయసాయి రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. పార్టీలో ఉన్న ఇతర నాయకులు కూడా ఈ ఘటనను చూశారని తెలిపారు. అప్పటికే సజ్జల చేతిలో జగన్ బందీ అయిపోయారని, అందుకే తనను పూర్తిగా పక్కనపెట్టేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో "సాయన్నకు వయసైపోయింది, ముసలోడైపోయాడు" అంటూ అనుబంధ సంఘాల బాధ్యతల నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఉత్తరాంధ్ర, గుంటూరు నుంచి తిరుపతి వరకు ఉన్న జిల్లాల ఇంఛార్జ్ బాధ్యతల నుంచి, చివరకు కోర్ కమిటీ నుంచి కూడా తొలగించారని వివరించారు. ఇలాంటివి మొత్తం 74 అవమానాలు జరిగాయని, ఎన్నో విషయాలు కడుపులోనే దాచుకున్నానని అన్నారు.

**సకల శాఖల మంత్రిగా సజ్జల.. జగన్‌కు గోడ కట్టారు**

"2019లో పార్టీ ఘనవిజయం సాధించిన తర్వాత సజ్జల ప్రమేయం శృతిమించింది. పరిపాలన జగన్‌గారు చేశారా లేక సజ్జల 'సకల శాఖల మంత్రి'గా, రాజ్యాంగేతర శక్తిగా తన ముఠాతో చేశారా? ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సైతం అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా జగన్‌ను కలవనీయకుండా గోడ కట్టింది సజ్జల కాదా?" అని విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. పెద్దిరెడ్డి, బొత్స, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరినీ రీజినల్ కోఆర్డినేటర్లుగా పెట్టి, అందరూ చీఫ్ కోఆర్డినేటర్ సజ్జలకు రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు తనకు ఆమోదయోగ్యం కాలేదన్నారు. అందుకే తన ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేయలేక, నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలాన్ని ముందే వదులుకుని పార్టీకి కూడా రాజీనామా చేశానని స్పష్టం చేశారు.

**వైసీపీలో నంబర్ 2 జగన్.. నాది కోవర్ట్ రాజకీయం కాదు**

"ఇప్పుడు వైసీపీలో నంబర్ 2 ఎవరంటే జగన్‌గారు. నంబర్ 1 ఎవరంటే 'సకల శాఖల మంత్రి' సజ్జల" అని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ కొత్త నంబర్ వన్‌కు నమస్కారాలు, సాష్టాంగాలు పెడుతూ తాను సర్దుకుపోలేనని, అందుకే పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. తాను జగన్‌కు ఎన్నడూ ద్రోహం చేయలేదని, చేయబోనని స్పష్టం చేశారు. పార్టీని కబ్జా చేసి, జగన్‌ను మోసం చేస్తూ కోవర్ట్ రాజకీయం చేయడం తనకు చేతకాదని, తాను ప్రజాస్వామ్యబద్ధంగా నేరుగా గెలిచేందుకే యుద్ధం చేస్తానని, అందుకే కొత్త పార్టీ పెడుతున్నానని ప్రకటించారు. పార్టీలో ఎవరు కోవర్టుగా పనిచేస్తున్నారో కార్యకర్తలు, అభిమానులు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. మరో సందర్భంలో మీడియా ద్వారా మరిన్ని నిజాలు తెలియజేస్తానని తన లేఖను ముగించారు.

# నేనే గుంటూరు వస్తా

అభిమానులకు విజ్ఞప్తి చేశారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించారు. యాంజియోగ్రామ్ చేసిన అనంతరం, గుండె రక్తనాళాల్లో రెండు బ్లాకులు ఉన్నట్లు నిర్ధారించి, స్టెంట్లు వేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం అంబటి రాంబాబు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని స్పష్టం చేశాయి. ఈ వార్త తెలియడంతో తొలుత వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే, చికిత్స విజయవంతం కావడం, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు. రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని వైజాగ్, అమరావతి, తిరుపతిగా 3 జోన్లుగా విభజించినట్లు తెలిపారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సీఎస్ఆర్ నిధులతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు.

# అనుమానం కలిగిస్తోంది

ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెట్టిందనే రీతిలో బొప్పరాజు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విడుదల చేసిన నిధుల గురించి బొప్పరాజు ప్రస్తావించకపోవడం చూస్తుంటే ఆయన ధోరణి ఏంటో అర్థమవుతోంది. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై పూర్తి చిత్తశుద్ధితో ఉంది. తీవ్రమైన ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలోని పెండింగ్ బిల్లులను కూడా ఇప్పటికే చాలా వరకు చెల్లించాం" అని మంత్రి అనగాని వివరించారు. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయడం వెనుక ఆయన ఉద్దేశాలు వేరే ఉన్నాయని మంత్రి అనుమానం వ్యక్తం చేశారు.

# జగన్ సంకల్పం

కోసమే ఆయన మాట్లాడుతున్నారని... కానీ, ఆయన చేస్తున్న విమర్శల్లో ఏ ఒక్కదానికి నేటికీ ఆధారాలు చూపించలేకపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు రాకూడదని, ఏ ఒక్కరూ బాగుపడకూడదనే దుర్బుద్ధితోనే జగన్ ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి కొండంత అండగా ఉన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దానిని ఖచ్చితంగా సాధించి తీరతామని ధీమా వ్యక్తం చేశారు.

# రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత : రేవంత్

స్వీకరించాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేందుకు, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నట్లు కమిటీ వెల్లడించింది.

# నేపాల్‌లోనే ఖననం

సేకరించామన్నారు. వాటి గుర్తింపు సంఖ్యలను ఉపయోగించి రికార్డులు భద్రపరుస్తామని తెలిపారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన అనంతరం వారి కుటుంబసభ్యుల డీఎన్ఏలతో పరీక్షిస్తామని పేర్కొన్నారు.

**మరోసారి వరద ముప్పు..**

నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు వెల్లడించారు. పలు ప్రాంతాల్లో వరద ఇంకా అదుపులోకి రాలేదన్నారు. భోటేకోషి, త్రిశూలి నదులకు మరోసారి వరద ముప్పు ఉందని, స్థానిక ప్రజలు ఆయా నదుల తీరానికి దూరంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. తదుపరి సమాచారం ఇచ్చే వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించింది. వరదల ముప్పు దృష్ట్యా సెర్చ్, రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న వారితోపాటు ప్రయాణికులు, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

**తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన**

**మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ**

**సెప్టెంబర్ 2 వరకు వర్షాల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వెల్లడి**

**లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**



**ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో వేగంగా మారుతున్న ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ 2 వరకు కొనసాగే అవకాశం ఉందని, ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, రాజధాని హైదరాబాద్‌లో రానున్న 24 గంటల్లో ఆకాశం దట్టంగా మేఘావృతమై అప్పుడప్పుడు వాన చినుకులు పడే అవకాశం ఉందన్నారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని... చెట్లు, భారీ విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద నిలబడ వద్దని హెచ్చరించారు. వర్షం కురుస్తున్న సమయాల్లో వాహనదారులు ప్రయాణాల్లో వేగాన్ని తగ్గించి జాగరూకతతో వాహనాలు నడపాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

## ఏపీ కార్పొరేషన్లలో కూటమి లెక్కలు ఎలా?

# జనసేన, బీజేపీ మేయర్ స్థానాలు ఎన్ని?




ఏపీలో స్థానిక ఎన్నికల వేళ కూటమి పార్టీల మధ్య పొత్తులపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా కాకుండా ఈ సారి ఎక్కువ చోట్ల పోటీ చేస్తామని, బలం ఉన్న ప్రతిచోట తమ అభ్యర్థులు బరిలోకి దిగుతారంటూ జనసేన నేతలు చేస్తున్న ప్రకటనలతో పొత్తు రాజకీయం హీటెక్కుతోంది. ముఖ్యంగా నగరపాలక సంస్థల పరిధిలో పొత్తులు ఎలా ఉంటాయనేది ఎక్కువ ఆసక్తి రేపుతోంది. కేబినెట్ హోదా ఉండే మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి కోసం చాలా మంది నేతలు ప్రయత్నిస్తుండగా, పొత్తులు ఆయా నేతలను టెన్షన్ కు గురిచేస్తున్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 123 మున్సిపాలిటీలు ఉండగా, 17 కార్పొరేషన్లు ఉన్నాయి. ఇందులో ఏ పార్టీ ఎన్నిచోట్ల పోటీ చేస్తుంది? కూటమిలోని ప్రధాన పార్టీ టీడీపీ ఎక్కడెక్కడ పోటీ చేస్తుంది? జనసేనకు ఏయే నగరాలు కేటాయిస్తుంది? బీజేపీకి మేయర్ పదవి ఇస్తారా? ఇవ్వరా అన్నదే ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. పొత్తు చర్చలతో సంబంధం లేకుండా మచిలీపట్నం వంటి చోట్ల జనసేన నేతలు మేయర్ పదవుల కోసం బహిరంగంగా వాదులాటకు దిగుతుండటంతో పొత్తు రాజకీయాలు కాకరేపుతున్నాయని చెబుతున్నారు. గత ఎన్నికల సమయంలో తాము పోటీ చేసిన స్థానాలను ఇప్పుడు తమకు వదిలేయాలని జనసేన కోరుతోంది. అయితే అప్పట్లో పొత్తు లేకపోవడం ఒక కారణమైతే, ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతుండటం వల్ల మేయర్ స్థానాల విషయంలో ఉత్కంఠ సాగుతోందని అంటున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కాకినాడ, రాజమండ్రి వంటి మున్సిపల్ కార్పొరేషన్లను జనసేన కోరుకుంటుందనే ప్రచారం హీటెక్కిస్తోంది. పొత్తులపై కూటమి పార్టీలు ఇప్పటివరకు సమావేశం అవ్వకపోగా, ఎన్నికలకు ఏ క్షణమైనా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందన్న సమాచారమే ఆందోళనకు గురిచేస్తోందని అంటున్నారు. కూటమి పార్టీలకు చెందిన అధిష్టానాలు పొత్తులపై ఎవరూ బహిరంగంగా మాట్లాడొద్దని సూచిస్తున్నాయి. కానీ, పదవుల ఆశతో ఉన్న నేతలు తమ ఆత్రుతను అనుచుకోలేక పొత్తులపై అంచనాలు వేస్తూ వేడిపుట్టిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ప్రాంతాలు, పట్టణాల వారీగా మూడు పార్టీలు ఎక్కడెక్కడ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయనే విషయమై ఊహాగానాలకు తెరతీస్తున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా జనసేనకు కేటాయించే స్థానాలపైనే ఎక్కువ చర్చలు జరుగుతున్నాయని అంటున్నారు. ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించనుండటంతో పొత్తుల్లో మూడు పార్టీలు బలాబలాలు ఆధారంగా మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులను తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. అయితే బలంతో సంబంధం లేకుండా విశాఖపట్నం మేయర్ పదవిని తమకు వదిలేయాలని బీజేపీ కోరుతున్నట్లు జరుగుతున్న ప్రచారంతో టీడీపీ ఆశావహులు టెన్షన్ పడుతున్నారని అంటున్నారు. అదే సమయంలో గోదావరి పరిధిలోని కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జనసేన ఆశిస్తోందని అంటున్నారు. దీంతో ఆయా జిల్లాల్లో మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులు ఆశించిన టీడీపీ నేతలు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చెబుతున్నారు. మొత్తానికి పొత్తులపై కూటమి లెక్కలు రాజకీయంగా తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తున్నట్లు చెబుతున్నారు.

# వరదల్లో కొట్టుకొచ్చిన 'లాకర్'.. రూ.లక్షలు లూటీ చేసిన స్థానికులు

**ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** నేపాల్‌లో ఆకస్మిక వరదలు సృష్టించిన విలయం తీరని నష్టాన్ని మిగిల్చింది. గ్రామాలకు గ్రామాలు కొట్టుకుపోవడంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగానే నమోదవుతోంది. విపత్తు వేళ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం విరాళాలు సేకరిస్తున్న క్రమంలోనే ఓ ఘటన చోటుచేసుకుంది. వరదల్లో ఓ బ్యాంకు లాకర్ కొట్టుకురాగా.. దాన్ని పగలగొట్టిన కొందరు వ్యక్తులు అందులో ఉన్న నగదును దోచుకెళ్లారు. ధాడింగ్ జిల్లా పోలీసుల ప్రకారం.. రసువా జిల్లాలోని భోటే కోశి ప్రాంతంలో సంభవించిన వరదల్లో ఓ బ్యాంకు లాకర్ కొట్టుకువచ్చింది. అది ధాడింగ్ జిల్లాలోని నది తీరంలో ఓ చోట కనిపించింది. దానిని గుర్తించిన కొందరు స్థానికులు ఇళ్లకు తీసుకెళ్లి పగలగొట్టారు. అందులో ఉన్న నగదును తీసుకెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. మొత్తం 29 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.50లక్షల నగదును (భారత కరెన్సీలో) స్వాధీనం చేసుకున్నారు.

## ఎడిటర్ వాయిస్

# వైసీపీలో జగన్ డమ్మీ.. నిజమేనా?

వైసీపీ ఎవరిది అంటే వెంటనే వచ్చే జవాబు జగన్ అని వస్తుంది. కాంగ్రెస్ నుంచి వేరు పడి జగన్ సొంతంగా వైసీపీని స్థాపించారు. ఆయన వైసీపీని పటిష్టపరచేందుకు జనంలో తిరిగారు. పాదయాత్రలు చేశారు, అలా జగన్ ఇమేజ్ తోనే వైసీపీ అనే పార్టీ ఏపీలో నిలిచి ఉంది. ఏపీలో టీడీపీ వంటి బలమైన పార్టీని తట్టుకుని వైసీపీ కొనసాగుతుంది అంటే దానికి జగన్ ఇమేజ్ ప్రధాన కారణం అన్నది తెలిసిందే. ఇక జగన్ మామూలు నాయకుడు కాదు, ఆయన కష్టాలు ఓర్చి ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొనే మొండితనం పట్టుదల కలిగిన వారు. ఆ లక్షణాలు నచ్చే ఏపీలో 40 శాతం ఓటు బ్యాంక్ వైసీపీకి జనం సమకూర్చారు. ఇక జగన్ నాయకత్వం కనుక లేకపోతే 2014లో తొలిసారి భారీ ఓటమి చూసిన తరువాత వైసీపీ అపుడే అంతరించిపోయేది. ఇక 2024లో కేవలం 11 సీట్లతో వైసీపీ చేదు ఫలితాలు అందుకుంది. ఆ వెంటనే వైసీపీ ముక్కలు చెక్కలు అయిపోయేది. కానీ ఈ రోజుకీ వైసీపీ బలమైన పార్టీగా ఉంది అంటే దానికి కర్త కర్మ క్రియ సర్వం సహ జగన్ అన్నది అందరికి తెలిసిందే.

**నంబర్ వన్ కారా :**

అలాంటి వైసీపీలో జగన్ నంబర్ వన్ కారా. ఈ మాట వింటేనే ఆశ్చర్యం వేస్తుంది. జగన్ కాకుండా వేరే వారు నంబర్ వన్ అంటే కూడా అది విస్మయం గొలుపుతుంది. అయితే అదే నిజం అంటున్నారు వైసీపీలో పునాదుల నుంచి ఉన్న నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి. ఆయన జగన్ తో సుదీర్ఘ కాలం పాటు కలసి ప్రయాణించారు. జగన్ మీద అక్రమ కేసులు పెడితే ఆయనతో పాటు పదహారు నెలలు జైలుకి వెళ్ళి వచ్చిన వారు విజయసాయిరెడ్డి. ఇక జగన్ ఒక్కరే కాదు వైఎస్సార్ అలాగే వైఎస్ రాజారెడ్డి మూడు తరాలుగా వైఎస్సార్ కుటుంబంతో పనిచేసిన వారు విజయసాయిరెడ్డి. మరి ఆయన చెప్పే మాటలకు విలువ ఉంటుందా అంటే ఆలోచించాల్సిందే. ఎందుకంటే విజయసాయిరెడ్డి వైసీపీలో ఉన్నపుడు ఈ తరహా విమర్శలు చేస్తే వాటికి నిజంగా విలువ ఎక్కువ. కానీ ఆయన పార్టీని వీడిపోయారు. పైగా ఏణ్ణర్థం తరువాత విమర్శలు ఎక్కుపెడుతున్నారు. దాంతో ఇవి చర్చకు బాగుంటున్నాయి కానీ నిజంగా వైసీపీలో అలాగే జరుగుతోందా అన్నది కూడా అయితే ఆలోచించాల్సిందే అంటున్నారు.

**ఏదో జరుగుతోంది :**

అయితే విజయసాయిరెడ్డి బయటకు వచ్చారని ఆయన వైసీపీ మీద కక్ష కట్టి ఈ రకంగా విమర్శలు చేస్తున్నారు అనుకోవడానికి కూడా పూర్తిగా లేదు, ఆయన ఇపుడు వైసీపీని ఎంతలా బదనాం చేసినా ఆయనకు ప్రత్యేకంగా ఒరిగేది ఏమీ ఉండదు, ఎందుకంటే ఆయన కొత్త పార్టీ పెట్టుకున్నా వచ్చి చేరేవారు ఎవరూ ఉండరు, అదే ఆయన మరో పార్టీలో చేరి ఈ తరహా విమర్శలు చేసి ఉంటే అక్కడ ఆయన ప్లేస్ ని పదిలం చేసుకోవడానికి అని అనుకోవచ్చు. కానీ విజయసాయిరెడ్డి ఇపుడు సుదీర్ఘమైన లేఖలు రాసి వైసీపీ మీద ఘాటు వ్యాఖ్యలు చేస్తూ నేరుగా జగన్ మీదనే బాణాలు వేస్తున్నారు అంటే అక్కడ ఏదో జరుగుతోంది అన్న భావన మాత్రం సామాన్య జనంలో ఉంది. దానికి తగినట్లుగా పార్టీలో కార్యకలాపాలు జరుగుతున్నాయని అంటున్నారు.

**జగన్ ఎక్కడ :**

ఈ ప్రశ్నకు జవాబు వేసుకుంటే చాలు విజయసాయిరెడ్డి ఆరోపణలలో ఎంతో కొంత మ్యాటర్ ఉంది అని అనుకుంటారు. జగన్ గడచిన రెండేళ్లకు పైగా వైసీపీ కార్యక్రమాలలో పెద్దగా కనిపించడం లేదు అన్నది అంతా అంటున్నదే. అదే సమయంలో ఆయన జనంలోకి కూడా వెళ్లడం లేదు, ఇక ముఖ్యమైన కార్యక్రమాలు కానీ పార్టీ మీటింగులు కానీ అన్నీ జగన్ లేకుండానే జరుగుతున్నాయని గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో జగన్ కోసం ఆయన అపాయింట్మెంట్ కోసం ఈ రోజుకీ ఎదురుచూసే వారు ఎందరో నాయకులే ఉన్నారని అంటున్నారు. ఇక కార్యకర్తలకు అయితే అది దుర్లభం అన్న మాట కూడా వినిపిస్తూ ఉంటుంది.

**చుట్టూ కోటరీ ఉందని :**

జగన్ చుట్టూ కోటరీ ఉందని కూడా విజయసాయిరెడ్డి గతంలో చెప్పారు. మరి ఇపుడు ఆ కోటరీ వల్లనే జగన్ ని నేతలు అంతా సులువుగా కలుసుకోలేకపోతున్నారా అన్న చర్చ ఉంది. మొత్తం మీద చూస్తే విజయసాయిరెడ్డి పార్టీని వీడిపోయారు అని ఆయన చేస్తున్న విమర్శలను కొట్టి పారేయడానికి లేదు అన్న మాట ఉంది. వైసీపీ భిన్నమైన రాజకీయ పార్టీగా ఉంది అన్నది తెలిసిందే. టీడీపీ లాంటి చోట్ల అధినాయకులే అన్ని కార్యక్రమాలలో కనిపిస్తారు, వైసీపీ ఆ తరహా దృశ్యాలు అయితే కనిపించవు. అందుకే విజయసాయిరెడ్డి వైసీపీలో జగన్ డమ్మీ అని నంబర్ టూ అని అంటూంటే అంతా ఆలోచిస్తున్నారు. దాని మీదనే సీరియస్‌గా చర్చిస్తున్నారు కూడా.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## క్రైమ్ వాయిస్

### వేప చెట్టుకోసం 25 ఏళ్లుగా గొడవ.. ఇద్దరి దారుణహత్య

**మేళ్లచెరువు, విశ్వం వాయిస్ న్యూస్ :** సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో దారుణం జరిగింది. ఇంటిపక్కనున్న వేపచెట్టు విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కేసును పక్కదారి పట్టించేందుకు కుమారుడే తండ్రిని చంపడం మరింత విషాదంగా మారింది.




ఇంటి సరిహద్దులో ఉన్న వేప చెట్టు విషయంలో వెంకటేశ్వర్లు, భూక్యా సైదా కుటుంబాల మధ్య 25 ఏళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శనివారం ఉదయం వెంకటేశ్వర్లు కొంతమందిని పిలిచి వేపచెట్టు నరికించారు. భూక్యా సైదా కుమారుడు రాము ఈ విషయాన్ని గమనించి వెంకటేశ్వర్లు వద్దకు వెళ్లి.. చెట్టు విషయంలో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి, ఎలా చెట్టును కొట్టేస్తారని ప్రశ్నించారు. దీంతో గొడవ పెద్దది కావడంతో భూక్యా రాము గొడ్డలితో దాడి చేయడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదంతా గమనించిన భూక్యా రాము తండ్రి సైదా అక్కడికి వెళ్లి అడ్డుకోబోయే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో రాము తన తండ్రిపై కూడా గొడ్డలితో దాడి చేయడంతో సైదా కూడా మృతి చెందారు. వేప చెట్టు విషయంలో పరస్పరం జరిగిన దాడుల్లో వెంకటేశ్వర్లు మృతి చెందాడని చిత్రీకరించేందుకే రాము తన తండ్రిపై దాడి చేశాడని స్థానికులు చెబుతున్నారు. ఇదంతా గమనించిన గ్రామస్థులు భూక్యా రాము ఇంటిపై రాళ్ల దాడికి దిగారు. సమాచారం తెలుసుకుని ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పరిస్థితి అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మేళ్ల చెరువు ఎస్ఐ నవీన్ కుమార్ తలకు గాయాలయ్యాయి. వెంటనే అతన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరిని గొడ్డలితో నరికి చంపిన రామును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### విశాఖలో దారుణం.. ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య



**వేపగుంట, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ జిల్లా పెందుర్తి పరిధిలోని చింతల అగ్రహారంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కొత్తవలసకు చెందిన మల్లా వినోద్ కుమార్ కొంతకాలంగా జీవనోపాధి కోసం పెందుర్తిలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. వినోద్ ఆటో డ్రైవర్‌గా, అతని భార్య కాయగూరల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు రెండేళ్లు, మూడేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా నిన్న కుటుంబ సభ్యులతో రాఖీలు కట్టించుకున్న వినోద్ కుమార్.. రాత్రి సమయంలో సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు 'రిప్' అంటూ సందేశం పంపినట్లు సమాచారం. ఆ తర్వాత ప్రవీణ్ కుమార్ ఉరివేసుకుని, అతని భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు విషపదార్థం తిని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తల్లి, ఇద్దరు బిడ్డలను వెంటనే ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాఖీ పండుగ రోజున కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన అనంతరం చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలా.. ఆర్థిక ఇబ్బందులు కారణమా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.


### జూబ్లీహిల్స్.. కొత్త కారుకు పూజ కోసం వెళ్లి..



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్త కారు కొన్న ఆనందంలో పూజ చేయించేందుకు జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయానికి వచ్చిన ఓ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలానికి చెందిన తుమ్మలపల్లి రామచంద్రరావు (70) తన భార్య గంగాభవానితో కలిసి వైద్య పరీక్షల కోసం హైదరాబాద్‌కు వచ్చారు. మియాపూర్‌లో ఉంటున్న అతని మేనల్లుడు సాయికుమార్ కొత్త కారు కొనుగోలు చేయడంతో కుటుంబ సభ్యులతో కలిసి పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లారు. పూజ సమయంలో కారును కాస్త ముందుకు నడపాలని పూజారి సూచించారు. దీంతో సాయికుమార్ కారును ముందుకు నడిపే క్రమంలో.. బ్రేక్ బదులు ఎక్సలేటర్ తొక్కడంతో ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లింది. ఆ సమయంలో కారు ముందు నిల్చున్న రామచంద్రరావును ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇవాళ ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మేనల్లుడు కొత్త కారు కొన్న ఆనందంలో పూజకు వచ్చిన కుటుంబంలో.. అదే కారు కారణంగా మామ ప్రాణాలు కోల్పోవడం విషాదం మిగిల్చింది.

### విజయవాడలో మహిళపై సామూహిక అత్యాచారం?

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ నగరంలోని వాంబే కాలనీలో ఒంటరిగా ఉంటున్న మహిళపై ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత మహిళ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానికుల కథనం ప్రకారం.. వాంబే కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ మహిళ ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి స్థానికంగా జులాయిగా తిరిగే ఐదుగురు యువకులు మద్యం మత్తులో ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం మహిళా ఎంతసేపటికీ స్పందించకపోవడంతో చుట్టుపక్కల వారు ఆమెను ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నున్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో పోలీసులు ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం నిందితులను అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు నున్న గ్రామీణ పోలీస్ స్టేషన్ సీఐ తెలిపారు.



# విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు

ఆదివారం, 30 ఆగస్టు, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత — www.viswamvoice.com





## పారుపాకలో ప్రభుత్వ స్థలంపై వివాదం

# పంచాయతీ తీర్మానంపై గ్రామస్తుల భగ్గు!

### "అందరి స్థలాన్ని ఏకపక్షంగా ఎలా కేటాయిస్తారు?"




**గ్రామసభ తీర్మానం లేకుండనే** ఆలయ నిర్మాణానికి రంగం సిద్ధం చేశారంటూ ఆరోపణలు


**వివాదాస్పద స్థలంలో పోలీసుల పహారాలో పనులు..** అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

**అందరికీ ఉపయోగపడేలా 'పశువుల బోను'** నిర్మించాలంటూ కలెక్టరేట్‌కు రైతుల తరలింపు

**ఐదు నెలలుగా వినతులు ఇస్తున్నా** స్పందన లేదంటూ ఆవేదన



స్థలంపై గ్రామస్తుల సమావేశం




**తీర్మానం ఎలా జరిగింది?**
గ్రామసభ నిర్వహించరా? అనుమతులు తీసుకున్నారా? ఒకే వర్గానికి అనుకూలంగా తీర్మానం చేశారంటూ గ్రామస్తుల ప్రశ్న. కలెక్టరేటక్లో వినతిపత్రం సమర్పించిన రైతులు.

**పోలీసుల సమక్షంలో పనులా?**
వివాదం పరిష్కారం కాకముందే నిర్మాణ పనులు కొనిసాగుతున్నాయని, పోలీసు భదత కల్పించిడంపై అనుమానాలు వ్యక్తం.

**పశువుల బోను నిర్మిస్తేనే న్యాయం**
అలయం నిర్మాణానికి వ్యతిరేకం కాదని, గ్రామ ప్రజలకు కోజాపారీగా అవసరమైన పశువుల బోను (పాండ్) ఏర్పాటు చేయాలంటూ డిమాండ్.

**అధికారులు ఏం చేయాలి?**
భూమి రికార్డులు, పంచాయతీ తీర్మానం, గ్రామసభ వివరాలు, అనుమతులు సమగ్రంగా పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి.

**కాకినాడ, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :**
రౌతులపూడి మండలం పారుపాక గ్రామంలో ప్రభుత్వ స్థలానికి సంబంధించిన వివాదం రోజురోజుకూ ముదురుతోంది. గ్రామసభ నిర్వహించకుండా, స్థానిక ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా స్థలాన్ని ఒక వర్గానికి అనుకూలంగా కేటాయించేందుకు పంచాయతీ తీర్మానం చేశారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదే సమయంలో వివాదంలో ఉన్న స్థలంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి స్థలానికి సంబంధించిన రికార్డులు, పంచాయతీ తీర్మానం, గ్రామసభ వివరాలు, నిర్మాణానికి ఉన్న అనుమతులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**తీర్మానం ఎలా జరిగింది?**

పారుపాకకు చెందిన పక్కుర్తి జీవ జయబాబు, గుంటబోయిన చిట్టిబాబు, చలమాల బాబులు, కొల్లు వరహాల బాబు, గుంటబోయిన శివ, యు. అర్జునుడు తదితర రైతులు, గ్రామస్తులు కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల విభాగానికి వినతిపత్రం సమర్పించారు. వారి వాదన ప్రకారం.. గ్రామానికి చెందిన ఉమ్మడి ప్రభుత్వ స్థలాన్ని ఒక వర్గానికి అనుకూలంగా ఉపయోగించేందుకు పంచాయతీ స్థాయిలో నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తున్నారు. అయితే ఆ నిర్ణయానికి ముందు గ్రామసభ నిర్వహించారా? గ్రామసభ తీర్మానం ఉందా? సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

**పోలీసుల సమక్షంలో పనులపై అభ్యంతరం**

వివాదం పరిష్కారం కాకముందే స్థలంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. అక్కడ పోలీసులు భద్రత కల్పించడం కూడా తమకు అనుమానాలు కలిగిస్తోందని తెలిపారు. అయితే పోలీసుల బందోబస్తు ఏ కారణంతో ఏర్పాటు చేశారు? శాంతిభద్రతల పరిరక్షణ కోసమేనా? లేక నిర్మాణ పనులకు సంబంధించిన పరిస్థితుల నేపథ్యంలోనా? అనే అంశాలపై కూడా సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**ఐదు నెలలుగా వినతులు.. పరిష్కారం ఎక్కడ?**

స్థల వివాదంపై గత ఐదు నెలలుగా జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో నిర్మాణ పనులు ముందుకు సాగితే గ్రామంలో మరింత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల అధికారులు తక్షణమే స్పందించి, ఇరువర్గాల వాదనలు విని వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరుతున్నారు.

**"ఎవరికీ వ్యతిరేకం కాదు.. ప్రజాప్రయోజనమే ముఖ్యం"**

తాము ఆలయ నిర్మాణానికి గానీ, ఏ వర్గానికీ వ్యతిరేకం కాదని గ్రామస్తులు స్పష్టం చేశారు. అయితే గ్రామానికి చెందిన ప్రభుత్వ స్థలం అందరికీ ఉపయోగపడే విధంగా ఉండాలని కోరుతున్నామని తెలిపారు. ఆ స్థలంలో గ్రామంలోని పాడి రైతులు, సామాన్య ప్రజలకు ఉపయోగపడే 'పశువుల బోను (పౌండ్)' ఏర్పాటు చేస్తే ప్రజాప్రయోజనం ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు.

**అధికారులు ఏం చేయాలి?**

ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముఖ్యంగా స్థలానికి సంబంధించిన ప్రభుత్వ రికార్డులు, పంచాయతీ తీర్మానం, గ్రామసభ నిర్వహణకు సంబంధించిన వివరాలు, నిర్మాణ అనుమతులు, స్థల వినియోగానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. వివాదం తేలే వరకు నిర్మాణ పనుల విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకుని, ఇరువర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**రామచంద్రపురం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం క్రీస్తుపూర్వం నుంచే ఎంతో లిఖిత సాహిత్యంతో సుసంపన్నమై ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు నిరంతరం సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ద్వారా వారిలో మానసిక వికాసంతో పాటు సృజనాత్మకత పెంపొందుతుందని వివరించారు. ముఖ్య వక్త డాక్టర్ ర్యాలీ శ్రీనివాస్ ప్రసంగిస్తూ.. నన్నయ్య ఆంధ్రీకరణ ద్వారా మనకు అందించిన కథాకథన పద్ధతిని స్ఫూర్తిగా తీసుకుని రచనా వ్యాసంగం కొనసాగిస్తే విద్యార్థుల్లో సాహిత్య నైపుణ్యాలు మెరుగుపడతాయని సూచించారు. వ్యావహారిక భాషా పద ప్రయోగాలతోనే మాతృభాష కలకాలం పదిలంగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎన్.సుజాత మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో తెలుగు భాషా అధ్యయనం ద్వారా అనేక ఉపాధి అవకాశాలు పొందవచ్చని, విద్యార్థులు ఈ దిశగా దృష్టి సారించాలని సూచించారు. హిస్టరీ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు మాతృభాషలోని సాహిత్యకారుల విశిష్టతను వివరిస్తూ చక్కటి గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్, తెలుగు హిందీ విభాగాధిపతి డాక్టర్ ఎన్.వి.రమణ, అధ్యాపకులు శ్రీరామమూర్తి పాల్గొన్నారు. విద్యార్థులు స్వయంగా సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ఉపన్యాసాలు, పాటలతో వేడుకలను ఉత్సాహంగా జరిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాలుపంచుకున్నారు.

## శ్రీ చైతన్య స్కూల్లో ..





**మండపేట మండలం, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29న తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, తెలుగు భాష గొప్పతనాన్ని, ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు మాతృభాషపై అభిమానం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. రీజినల్ ఇన్‌చార్జి నరేశ్ మాట్లాడుతూ "తెలుగు మాతృభాష. భాషను ఎప్పటికీ మరువకూడదన్నారు. ఆంగ్ల భాషతో పాటు తెలుగులోనూ విద్యార్థులు ప్రావీణ్యం సాధించి, అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని అన్నారు. తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలుగు భాషాభివృద్ధికి, విద్యార్థుల్లో భాషా నైపుణ్యాల పెంపునకు సేవలందిస్తున్న తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా క్రీడా జ్యోతిని కూడా వెలిగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఇన్‌చార్జీలు, తెలుగు ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## భాష్యంలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు

**రాయవరం, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలోని భాష్యం విద్యాసంస్థల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో తెలుగు భాషపై అభిమానం, క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, ఉక్తలేఖనం వంటి పోటీలు నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనం, ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించి విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించారు. విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్త, చాంప్స్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి తదితరులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో విద్యాసంస్థల ప్రాంగణం సందడిగా మారింది.

## పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



**గోకవరం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** పెంటపల్లి గ్రామంలోని వీరాఖూ పాఠశాలకు విద్యార్థుల విద్యా అవసరాల నిమిత్తం రూ.14 వేల విలువైన ప్రింటర్‌ను దాతలు బహూకరించారు. పాలలీర్దపు గనిరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు అంజన్, పవన్‌లు ఈ ప్రింటర్‌ను అందజేశారు. మాజీ జెడ్పీటీసీ పాలూరి బోసుబాబు చేతుల మీదుగా పాఠశాల సిబ్బందికి ప్రింటర్‌ను అందించారు. పాఠశాల అవసరాలను గుర్తించి ప్రింటర్‌ను బహూకరించిన అంజన్, పవన్‌లను పాఠశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థులకు, పాఠశాల నిర్వహణకు ఈ ప్రింటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

## పట్టణంలో రూ 4.77 కోట్ల పనులతో ప్రగతి పథంలో మండపేట

ఇంటింటా ప్రచారంలో వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు

**మండపేట టౌన్, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వ పాలనలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. "రెండేళ్ల పాలనలో అభివృద్ధి - సంక్షేమం" ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా మండపేట పట్టణంలో శనివారం కూటమి నాయకులతో కలసి ఆయన బైక్‌పై విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని 18, 19, 21, 22, 23, 24, 25, 26, 27, 28, 29, 30 వార్డులలో పర్యటించిన ఆయన, గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో ఉన్న ప్రత్యేక కరపత్రాలను ప్రజలకు స్వయంగా అందజేశారు. ఈ పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. కపిలేశ్వరపురం రోడ్డులో రూ.12.50 లక్షల వ్యయంతో నిర్మించిన 4 పింక్ టాయిలెట్లను, పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రూ.5.00 లక్షలతో ఏర్పాటు చేసిన ఫైబర్ సింహం బొమ్మను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పలు నూతన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 24వ వార్డులోని డంపింగ్ యార్డులో రూ.3.05 కోట్లతో నిర్మించనున్న తడి, పొడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రానికి, విజయలక్ష్మి నగర్‌లో రూ.97.39 లక్షలతో నిర్మించే సి.సి. రోడ్లకు, కృష్ణకళ్యాణి నగర్‌లో రూ.27.00 లక్షల సి.సి. రోడ్డు పనులకు, అదే నగర్ మున్సిపల్ సైట్‌లో క్రీడల ప్రోత్సాహార్థం రూ.21.00 లక్షలతో ఏర్పాటు చేయనున్న బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌కు శంకుస్థాపన



చేశారు. అలాగే ఏడిద రోడ్డు జంక్షన్ నుండి మీ-సేవా ఆఫీసు వరకు రూ.5.00 లక్షలతో కవర్ స్లాబ్స్ ఏర్పాటుకు, రజక చెరువు కాంపౌండ్ వాల్ (ఫుడ్ కోర్ట్) వద్ద రూ.4.90 లక్షలతో ఇంటర్ లాకింగ్ టైల్స్ అమర్చే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, పట్టణాలు, గ్రామాలు మౌలిక సదుపాయాలు లేక నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ పనులు పూర్తిచేస్తున్నామని చెప్పారు. కేవలం ఒక్క రోజులోనే కోట్ల రూపాయల విలువైన పనులకు శ్రీకారం చుట్టడమే తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. ప్రజల సంక్షేమంతో పాటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అన్ని వార్డులలోనూ తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## శ్రీ చైతన్య పాఠశాలలో
# ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**రావులపాలెం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ చైతన్య పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవనీయులు ఆర్.ఐ. నరేష్ , పాఠశాల ప్రిన్సిపాల్ జగదీశ్ తెలుగు భాషా మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్.ఐ. నరేష్ , ప్రిన్సిపాల్ జగదీశ్ మాట్లాడుతూ, తెలుగు మన మాతృభాష మాత్రమే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రతి విద్యార్థి తెలుగు భాషను ప్రేమించి, చక్కగా మాట్లాడటం, చదవడం, రాయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. మాతృభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు తెలుగు భాష పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయ వేషధారణలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే భగవద్గీత శ్లోకాలు, తెలుగు పద్యాలు, దేశభక్తి మరియు తెలుగు భాషా గౌరవాన్ని చాటిచెప్పే పాటలను ఆలపించి, తెలుగు భాష గొప్పదనం గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ కేవీఎస్వీ సతీష్, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ వై.ఎస్.ఎన్. మూర్తి, ఏవో రాజు, ప్రైమరీ ఇన్‌చార్జ్ కుమారి, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ లలిత, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాతృభాష మన గర్వకారణం... తెలుగు భాష మన ఆత్మగౌరవం

### తెలుగు తల్లి ఔన్నత్యం ప్రపంచానికి ఆదర్శం - తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ సందేశం



**రామచంద్రపురం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ తెలుగు భాష అనేది కేవలం ఒక భాష మాత్రమే కాదని, కోట్లాది మంది తెలుగువారి భావోద్వేగాలకు, సంస్కృతికి, చరిత్రకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. మధురమైన పదాలతో మనసులను హత్తుకునే తెలుగు భాష ప్రపంచ భాషలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని అన్నారు. "దేశ భాషలందు తెలుగు లెస్స" అని శ్రీకృష్ణదేవరాయలు కొనియాడిన తెలుగు భాష సాహిత్య సంపదకు నిలయమని, త్యాగరాజు కీర్తనలు, వేమన సత్యవాక్యాలు, గురజాడ సామాజిక చైతన్యం, గిడుగు వెంకట రామమూర్తి పంతులు భాషా సేవలు తెలుగు జాతికి చిరస్మరణీయమని కొనియాడారు. మాతృభాషను ప్రేమించడం అంటే మన మూలాలను ప్రేమించినట్లేనని, తెలుగు భాషను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. నేటి యువత ప్రపంచ భాషలను నేర్చుకుంటూనే మాతృభాషను గౌరవించాలని, తెలుగు చదవడం, రాయడం, మాట్లాడడాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వారసత్వ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. తెలుగు భాష వైభవాన్ని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు భాష చిరంజీవిగా వెలుగొందాలని, తెలుగు జాతి ఖ్యాతి ప్రపంచ నలుమూలలా మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తూ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ కొరడా

### ఈతకోట టోల్ ప్లాజా వద్ద 31 బస్సుల తనిఖీ..
### 9 బస్సులపై కేసులు నమోదు - రూ.17,500 అపరాధ రుసుము విధింపు



**అమలాపురం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనకు అడ్డుకట్ట వేసేందుకు రవాణాశాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఈతకోట టోల్ ప్లాజా వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం 31 బస్సులను తనిఖీ చేయగా, వివిధ రకాల నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 9 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.17,500 అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల నిర్వాహకులు, డ్రైవర్లు రవాణాశాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతకు విఘాతం కలిగించే విధంగా అతివేగంగా వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ప్రయాణికుల వ్యక్తిగత బ్యాగేజీకి మినహా కమర్షియల్ లగేజీని అనుమతులు లేకుండా బస్సుల్లో తరలిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీటీఓ దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల నిబంధనల పాటింపు, వేగ నియంత్రణ తదితర అంశాలను అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీటీఓ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వాహన యజమానులు, డ్రైవర్లపై ఎలాంటి మినహాయింపులు లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి ట్రావెల్స్ యాజమాన్యాలు పూర్తి బాధ్యత వహించాలని సూచించారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు ఓలేటి శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, షణ్ముఖ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై నిఘా పెంచాలి : కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లపై నిరంతరం నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీలోని మూడో అంతస్తులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్లను భద్రపరిచిన విధానం, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. గోదాము పరిసరాల్లో భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్లను అత్యంత భద్రతతో భద్రపరచాలని, గోదాములోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని పూర్తిగా నియంత్రించాలని సూచించారు. భద్రతా పర్యవేక్షణలో ఎలాంటి లోపాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడే విధంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోలీసు బందోబస్తును పెంచడంతో పాటు సీసీ కెమెరాలు, నిఘా వ్యవస్థలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో ఎలక్షన్ రిజిస్ట్రేషన్ బుక్‌లో సంతకాలు చేశారు. కలెక్టర్ వెంట ముమ్మిడివరం తహసీల్దార్ టి.సుభాష్, ఎన్నికల నిర్వహణ అధికారులు బాలాజీ, బాబ్జి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కె.గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో
# ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**కే.గంగవరం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** కె.గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వి.ఎస్. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు జి. వి.ఎస్. సుబ్రహ్మణ్యం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అమ్మ భాషలోని కమ్మదనాన్ని, మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇతర భాషలు నేర్చుకోవడం ఎంత అవసరమో, మన మాతృభాషను రక్షించుకోవడం, అందులో స్పష్టంగా మాట్లాడటం కూడా అంతే బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఏడుకొండలు గారు ప్రసంగిస్తూ.. తెలుగు భాషా విశిష్టతను, ప్రాచీన కాలం నుండి మన భాషకు ఉన్న గొప్పదనాన్ని, సాహిత్య తీరును విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు. తెలుగు భాషాభివృద్ధికి, సామాన్యులకు సైతం భాషను చేరువ చేయడానికి గిడుగు రామ్మూర్తి లాంటి మహనీయులు చేసిన విశేష కృషిని ఆయన కొనియాడారు. ఉపాధ్యాయుల స్ఫూర్తిదాయకమైన మాటలతో విద్యార్థుల్లో తమ మాతృభాష పట్ల మరింత అభిమానం వ్యక్తమైంది. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులందరి సమిష్టి భాగస్వామ్యంతో ఈ భాషా దినోత్సవ కార్యక్రమం అత్యంత విజయవంతంగా ముగిసింది.

# భాష్యం స్కూల్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం




**అమలాపురం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం భాష్యం స్కూల్ శాఖలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో తెలుగు భాషపై అభిమానం, మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, క్రీడల ప్రాధాన్యతను తెలియజేసేలా కార్యక్రమాలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా భాష్యం స్కూల్ విద్యార్థులు తెలుగు భాష గొప్పతనం, తెలుగు సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. తెలుగు భాషను ప్రేమించడం, నిత్య జీవితంలో తెలుగును గౌరవంగా ఉపయోగించడం ద్వారా మాతృభాషకు తగిన గౌరవం కల్పించాలని కార్యక్రమంలో వక్తలు విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని భాష్యం స్కూల్‌లో వివిధ క్రీడా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ తెలుగు లెక్చరర్, శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, 'నడక కవి' డాక్టర్ నల్లా నరసింహమూర్తి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలుగు భాష గొప్పతనాన్ని, తెలుగు సంస్కృతి విశిష్టతను వివరించారు. మాతృభాషను ప్రేమిస్తూ, తెలుగును నిత్య జీవితంలో గౌరవంగా ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు. భాష, సంస్కృతి పట్ల చిన్ననాటి నుంచే అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా భాష్యం స్కూల్ జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జవ్వాది వెంకట శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో విద్యార్థులు ప్రతిభను చాటుకోవాలని సూచించారు. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భాష్యం స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. క్రీడా కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. విద్యార్థుల్లో విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు భాష్యం స్కూల్ యాజమాన్యం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ వేడుకలను నిర్వహించడం విశేషం. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ అమలాపురం శాఖ ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, చాంప్స్ ఇన్‌చార్జ్‌లు కె. నాగశ్రీ, కె. రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులను, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# క్రీడలే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది : మంత్రి వాసంశెట్టి

**రామచంద్రపురం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్యానికి క్రీడలు ఆయువు పట్టు... యువత విజయాలకు క్రీడలే బంగారు బాట... క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుదామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు నిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంత్రి రాష్ట్ర ప్రజలకు, క్రీడాకారులకు,కోచ్ లకు,యువతకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలను సాధించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం దేశ క్రీడా చరిత్రలో ఎంతో విశిష్టమైన రోజని మంత్రి తెలిపారు. ప్రపంచ వేదికలపై భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు దేశ ప్రతిష్ఠను మరింత పెంచుతున్నాయని పేర్కొన్నారు. నేటి యువత చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన, చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని చెప్పారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. యువత తమ ప్రతిభను చాటుకొని రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని, గెలుపు-ఓటములను సమానంగా స్వీకరిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

## వ్యావహారిక తెలుగు భాషా స్ఫూర్తిని
# పునశ్చరణ చేసిన విద్యానిధి విద్యాసంస్థలు




**అమలాపురం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యావహారిక తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి వేడుకలను విద్యానిధి విద్యాసంస్థల విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యాన్ని వాడుక భాషలోకి తీసుకురావడంతో పాటు, ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో భాషను అందుబాటులోకి తీసుకురావడానికి గిడుగు రామమూర్తి చేసిన కృషి గురించి భాషా ఉపాధ్యాయురాలు ఉపద్రష్ట కృష్ణకుమారి విద్యార్థులకు వివరించారు. గిడుగు రామమూర్తి వేషధారణలో ఏడో తరగతి విద్యార్థి ఎ.యశ్వంత్ ప్రదర్శించిన వ్యావహారిక సంభాషణలు ఆకట్టుకున్నాయి. హైస్కూల్ విద్యార్థినులు తాళ్లపాక తిమ్మక్క, తరిగొండ వెంగమాంబ, కవయిత్రి మొల్ల వేషధారణలతో ప్రదర్శించిన సంభాషణలు ఉత్సాహభరితంగా, స్ఫూర్తిదాయకంగా సాగాయి. చదువుతున్న మాధ్యమం ఆంగ్లమైనప్పటికీ మాతృభాష పట్ల మమకారం, ఆసక్తిని పెంపొందించుకోవాలని, తెలుగు భాషలోని ఉత్తమ గ్రంథాలను ప్రతి విద్యార్థి చదవాలని విద్యానిధి విద్యాసంస్థల చైర్మన్ ఎ. బి. నాయుడు సూచించారు. తద్వారా భాషాభిరుచితో పాటు విజ్ఞానం కూడా పెంపొందుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కవులు, కవయిత్రుల సంప్రదాయ వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి. నాగమాధవి, ఉపాధ్యాయులు కె. నాగమణి, ఎ. జ్యోతి, ఎస్. గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.



### స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో

# పి4, విజన్ యాక్షన్ ప్లాన్ కీలకం

**పేదరిక నిర్మూలనకు పి4ను పకడ్బందీగా అమలు చేయాలి**
**విజన్ యాక్షన్ ప్లాన్‌లతో సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించండి**
**అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాలు**




**కాకినాడ, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగం గా ప్రారంభించిన విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు,పి 4 కార్యక్రమాలు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, ప్రత్యేకఅధికారులు, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విజన్ యాక్షన్ యూనిట్లు, పి4 కార్యక్రమాల అమలు, పురోగతిపై సమీక్ష నిర్వ హించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ లో భాగంగా పేదరిక నిర్మూలన ప్రధాన లక్ష్యంగా పి4 కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.పేదరిక నిర్మూలనతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించి,ప్రతి కుటుంబానికి స్థిరమైన ఆదాయం, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పి4 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమాజంలోని ఆర్థికంగా సంపన్న వర్గాలను, పేద కుటుం బాలను అనుసంధానం చేసి పేదరిక నిర్మూలనకు కృషి చేయడం పి4 ప్రధాన ఉద్దేశమన్నారు.సమాజంలోని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నవ్యక్తులు, ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి మార్గ దర్శకులుగా వ్యవహరించేలా చర్యలు చేపట్టాల ని సూచించారు. ఆర్థికంగా వెనుక బడిన పేద కుటుంబాలను గుర్తించి మార్గదర్శకుల ద్వారా దత్తత తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.మార్గదర్శకులు ఆయా కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు వ్యాపార శిక్షణ,కెరీర్ మార్గదర్శ కత్వం వంటి అంశాల్లో సహకరించి,కుటుంబాలు స్వయం సమృద్ధి సాధించేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రక్రియలో ఫెసిలిటేటర్ గా వ్యవహ రిస్తూ డిజిటల్ డ్యాష్ బోర్డ్ ద్వారా కార్యక్రమాల పురో గతిని నిరంతరం పర్యవేక్షి స్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. విజన్ యాక్షన్ ప్లాన్‌లతో సమగ్ర అభివృద్ధి,పి4 కార్యక్రమంతో పాటు స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను గ్రామ,వార్డు స్థాయి నుంచి సమర్థవంతంగా అమలు చేసేందుకు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు కీలకపాత్ర పోషించాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలం, సచివాలయ స్థాయి ల్లో స్థానిక అవసరాలు,వనరులు, సమస్య లను పరిగణనలోకి తీసుకుని స్పష్టమైన విజన్ డాక్యు మెంట్లు,కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. తలసరి ఆదాయం పెంపు, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.శాఖల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన పర్యవేక్షణ తో ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. పనితీరు సూచికల ఆధారంగా పర్యవేక్షణవిజన్ యాక్షన్ ప్లాన్‌ల అమలులోకి పెర్ఫార్మెన్స్ ఇండి కేటర్స్ ను నిర్దేశించి, నిర్దిష్ట కాలవ్య వధిలో సాధించాల్సిన లక్ష్యాలను స్పష్టంగా రూపొందించాలన్నారు. ఆర్థిక, సామాజిక అభివృద్ధికిసంబంధించిన సూచికలను నిరంతరం పర్య వేక్షిస్తూ,ఆర్థిక అసమానతలను తగ్గించి ప్రజల ఆర్థిక సాధికారత ను పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.ప్రజా సంతృప్తి స్థాయిని పెంచే విధంగా ప్రభుత్వ కార్య క్రమాల అమలును మరింత సమర్థ వంతంగా నిర్వహించాలని, తద్వారా ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం పెంపొందేలా పని చేయాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు పి4పై సమీక్ష రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి మూడు నెలలకు ఒకసారి పి4 కార్యక్రమం, విజన్ యాక్షన్ ప్లాన్‌ల పురోగతి ని సమీక్షించనున్న నేపథ్యంలో జిల్లా లో ఆశించిన ఫలితాలు సాధించేలా అధికారులు ముందస్తు కార్యాచరణ తో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.పేదరిక నిర్మూలనకు వేగంగా,శాశ్వతంగా మంచి ఫలితాలు అందించే వినూత్న కార్యక్రమాలు,బెస్ట్ ప్రాక్టీసెస్ కు గుర్తించి అమలు చేయాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అదనంగా పి4 కార్య క్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ఆర్థిక అస మానతలను తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. రైతులు,నిరుద్యోగులు,పేద కుటుంబాలు, మహిళలు, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడం,అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా సమగ్ర జిల్లా అభివృద్ధికి విజన్ యాక్షన్ ప్లాన్‌లు దోహద పడేలా రూపొందించాలని తెలిపారు.ఆరోగ్యకరమైన, సంతోషకరమైన సమాజం నిర్మాణానికి ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వేత్తలు,ప్రవాస భారతీయులు తదితరులు సమిష్టిగా భాగ స్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తలపెట్టిన పి4 కార్యక్రమం పేదరిక నిర్మూలనలో జిల్లా ఆదర్శంగా నిలిచేలా కాకినాడ జిల్లాలో సమర్థవంతమైన నమూనా ను రూపొందించి అమలుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో డాక్టర్ డి. తిప్పే నాయక్, డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాస రావు, మెప్మా పీడీ పి. శైలజ, సీపీఓ పి. త్రినాథ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఏ. రమణా రెడ్డి, స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు నోడల్ అధికారి జే.వేణుగోపాల్,జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రతినిధి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

**టిడిపి శ్రేణులకు యనమల దిశా నిర్దేశం**



**కోటనందూరు, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** మున్సిపల్ ఎన్నికలకు పార్టీ యంత్రాంగం సర్వసిద్ధంగా ఉండాలని మాజీ ఆర్థిక మంత్రి తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు టీడీపీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.హామీలను అమలు పర్చడంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వల్ల ప్రజల్లో విశ్వాస భావం మెండుగా ఉందని, ఎన్నికలకు కొద్ది రోజుల్లోనే నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో తుని పట్టణ సీనియర్ నేతలతో యనమల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తుని మున్సిపాల్టీ పరిధిలో గల 36 వార్డుల్లో గెలుపు గుర్రాల జాబితాపై సమీక్షించిన యనమల ప్రజలతో సత్సంబంధాలు కలిగి పార్టీకి విధేయులైన వారికి అగ్రతాంబూలం ఇవ్వాలని సూచించారు.ఆశావహుల జాబితా మాటెలాగున్నా భవిష్యత్ రాజకీయాలకు పట్టణాభివృద్ధిలో మమేకం అయ్యేవారికి అవకాశాలు కల్పించాలని సూచించారు.ఒక్కొక్క వార్డు నుంచి నాలుగైదు పేర్లు సూచించాలని కోరిన ఆయన సమర్ధులకు పెద్దపీట వేస్తామన్నారు. ఇదే సమయంలో పట్టణంలో గల ప్రధాన సామాజిక వర్గాలు కౌన్సిల్‌లో ప్రాతినిధ్యం వహించేలా అభ్యర్థుల ఎంపిక కసరత్తు ఉండాలన్నారు. అలాగే ఎన్నికల్లో భాగస్వామ్య పక్షాలైన జనసేన,బీజేపీలతో కలిసి వెళ్ళవల్సి ఉన్నందున సీట్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రిజర్వేషన్లు వచ్చేదాకా వెయిట్ చేయకుండా ముందస్తు అభ్యర్థుల కసరత్తు చేపట్టాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్య పద్దతిలో జరగాలని, ఇదే సమయంలో విపక్షం అరాచకాలు సృష్టిస్తే ప్రభుత్వం చట్టపరమైన చర్యలకు వెనకాడబోదని యనమల స్పష్టం చేసారు. ఈసమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్, సీనియర్ నేత మోతుకూరి వెంకటేష్, టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి సూరంపూడి చంద్రశేఖర్, పాత బజార్ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మెన్ కుక్కడపు బాలాజీ,పరవాడ తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ స్థానిక ఎన్నికలే...

**విజయమే లక్ష్యంగా కూటమి కార్యకర్తలు పనిచేయాలి : మాజీ మంత్రి యనమల**



**కోటనందూరు, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** టార్గెట్ స్థానిక ఎన్నికలే.ఈఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయ దుందుభిబే కూటమి శ్రేణుల ముందున్న కర్తవ్యం...ఈదిశగా కూటమి శ్రేణులు సమన్వయంతో సమిష్టిగా పని చేయాలని మాజీ ఆర్థిక మంత్రి టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు. గ్రామీణాభివృద్ధి,పేదరిక నిర్మూలన సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలులో స్థానిక సంస్థలదే కీలకమన్న యనమల ఆ లక్ష్యాలు నెరవేరాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.వైసీపీ చట్టబద్దపాలనను ఉల్లంఘిస్తూ ఎలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక పరిస్థితులను సృష్టించే కుట్ర వైసీపీకి దాగి ఉందని అలాంటి కుతంత్రాలు కుటిల రాజకీయాలు ఎదురైతే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని విపక్షం హింసకు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా కూటమి శ్రేణులు చట్టపరంగా ప్రజాస్వామ్య పద్దతుల్లో ఎదుర్కోవాలని యనమల పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరగాలని, అరాచకాల సృష్టి కర్తలను ప్రజాస్వామ్య బద్దంగా అడ్డుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిన యనమల, కూటమి నాయకులు లోపాయికారీ,చీకటి ఒప్పందాలకు ప్రతిపక్షం కాచుకుని ఉందని అలాంటి శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాని కూటమి శ్రేణులకు యనమల దిశానిర్దేశం చేసారు. ప్రజలకు కూటమిపై పూర్తి విశ్వాసం కనపరుస్తున్నారని అందుచేత విజయ దుందుభి మోగించేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలని ఆయన కోరారు .ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు బీసీల రిజర్వేషన్లు కల్పించాలని అసాధారణ పరిస్థితుల్లో రిజర్వేషన్ల శాతం పరిమితి మించవచ్చని సుప్రీం కోర్టు పేర్కొన్న విషయాన్ని ఈసందర్భంగా యనమల గుర్తు చేసారు.

# గిన్నెలారంలో పర్యటించిన జేసీ అపూర్వ భరత్

**గిరిజన సమస్యలు పరిష్కరిస్తాం.. - బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణ స్థల పరిశీలన - గిరిజనులతో మమేకమైన జేసీ వారి సమస్యల పట్ల సానుకూల స్పందన - కొండఎగువ గ్రామంలో పర్యటించిన మొట్టమొదటి జాయింట్ కలెక్టర్**




**రౌతులపూడి, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని ఉప ప్రణాళిక ప్రాంతమైన జల్దాం పంచాయతీ శివారు గిన్నెలారం లో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పర్యటించారు. ఏజెన్సీ గ్రామమైన గిన్నెలారానికి బిఎస్ఎన్ఎల్ టవర్ ఏడాది క్రితం మంజూరు అయింది. ఈ టవర్ నిర్మాణానికి గ్రామ కంఠం సర్వే నెంబర్ 4 లో స్థల కేటాయింపు జరిగింది. కొండ ఎగువ ప్రాంతంలో గిన్నెలారం గ్రామం ఉన్నందున టవర్ నిర్మాణ మెటీరియల్ తీసుకెళ్లడానికి ఇబ్బందులు ఉన్నాయని బిఎస్ఎన్ఎల్ డి ఇ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై జెసి అపూర్వ భరత్ చల్లూరు నుండి గిన్నెలారానికి కాలినడకన పర్యటించారు. అక్కడ గిరిజనులతో మమేకమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి బోరు, రోడ్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, కొండపోడు పట్టాలు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే బోరు నిర్మాణం చేపట్టాలని డి. ఇ కి ఆదేశించారు. రోడ్డు నిర్మాణం మంజూరు అయిందని టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు చేపడతామని పంచాయతీరాజ్ డి. ఇ.పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు, వార సత్వ పత్రాలు పెండింగ్ లేకుండా చూడాలని తాసిల్దార్కి ఆదేశించారు. గిరిజనుల సమస్యల పట్ల జె సి సానుకూలంగా స్పందించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. కొండఎగువ లో ఉన్న మా గ్రామానికి మొట్టమొదటిగా వచ్చిన జె. సి మీరేనని వారు పేర్కొన్నారు. ముందుగా బిఎస్ఎన్ఎల్ టవర్కు సంబంధించిన స్థలాన్ని పరిశీలన చేసి ఇంజనీరింగ్ అధికారులు, ఆర్డిఓ, తాసిల్దార్, అటవీశాఖ అధికారితో సమావేశమై చర్చించారు. ఈ పర్యటనలో ఆర్డీవో కృష్ణమూర్తి, తాసిల్దార్ కృష్ణకుమారి, ఎఫ్ ఎస్ ఓ శ్యామ్ కుమార్, డిప్యూటీ తాసిల్దార్ ఎస్ వి నరేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ దినేష్,తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటల సాగుపై

# రైతులకు శిక్షణా కార్యక్రమం



**కోటనందూరు, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా,కోటనందూరు మండలం బొద్దవరం గ్రామంలో ఉన్న రైతులకు నాసా సంస్థ ఈరోజు సేంద్రీయ వ్యవసాయంలో ఉపయోగించే నూతన వ్యవసాయ పద్దతులు ఘన, ద్రవ జీవమృతాలు ఖర్చు లేకుండా తయారుచేసుకోవచ్చునని రైతులకు ప్రత్యక్షంగా తయారుచేసి ఎలా ఉపయోగించుకోవాలో ఆ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ స్వర్ణలత రైతులకు వివరించారు. అంతేకాకుండా చెట్టు మొదలు దగ్గర బాగా శుభ్రం చేసుకుని పాలీలు తీసుకోవాలని అలాగే ఎండిపోయిన కొమ్మలను కత్తిరించుకోవాలని చెప్పారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఇండుగబిల్లి సత్యనారాయణ అంతర పంటల ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు ఆరుగుల నాగేశ్వరరావు, అయినవిల్లి పెద్దాపురం, దేవత, స్థానిక నాయకులు ఇతర రైతులు పాల్గొన్నారు.



# సేవలకు సత్కారం.. ఎస్సైని అభినందించిన ఎస్పీ

**కోటనందూరు, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** నాలుగు సంవత్సరాల క్రితం మహిళ మిస్సింగ్ కేస్ చేదించిన కాకినాడ జిల్లా, కోటనందూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ టి రామకృష్ణను జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన ప్రతిభకు ఈ ప్రశంసా పత్రం తార్కాణం. ప్రశంసా పత్రం అందుకున్న ఎస్సై రామకృష్ణను పెద్దాపురం డి.ఎస్.పి . ఏబీజె తిలక్, తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చెన్నకేశవరావు పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.






**గోకవరం, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ గోకవరం పంచాయతీలో రాజకీయ వేడి రోజురోజుకూ పెరుగుతోంది. సర్పంచ్ పీఠాన్ని దక్కించుకునేందుకు 'సై అంటే సై' అంటూ ఇప్పటికే పలువురు అభ్యర్థులు బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు సుమారు పది మంది అభ్యర్థుల పేర్లు తెరపైకి రాగా.. మరికొందరు తెరవెనుక పావులు కదుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్నికల షెడ్యూల్, తేదీ ఖరారైన వెంటనే మరికొందరు అభ్యర్థులు అధికారికంగా రంగంలోకి వచ్చే అవకాశముందని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీంతో సర్పంచ్ పదవికి పోటీ రోజురోజుకూ రసవత్తరంగా మారుతోంది.

**ఎవరి వైపు ఓటరు చూపు?**

అభ్యర్థుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ ఓటర్లలోనూ చర్చ మొదలైంది. ఎవరికి మద్దతు ఇవ్వాలి? ఎవరు పంచాయతీని సమర్థంగా నడిపించగలరు? అనే అంశాలపై గ్రామంలో జోరుగా చర్చలు సాగుతున్నాయి. అభ్యర్థుల బలాబలాలు, వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు, గతంలో చేసిన సేవలు వంటి అంశాలను ఓటర్లు బేరీజు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**'బిర్యానీ.. మందు' రాజకీయాలకు చెక్ పడుతుందా?**

గత ఎన్నికల తరహాలో ప్రలోభాలకు లొంగకుండా ఈసారి అభ్యర్థి సామర్థ్యం, వ్యక్తిత్వం, ప్రజలకు అందుబాటులో ఉండే తీరు ఆధారంగా ఓటు వేయాలని కొందరు ఓటర్లు భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో డబ్బు, విందులు, ఇతర ప్రలోభాల ప్రభావం ఉండకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు నాయకులు రాజకీయాలు చేసేవారు.. ఇప్పుడు ఓటర్లు కూడా రాజకీయాలను అర్థం చేసుకుని నిర్ణయం తీసుకుంటున్నారు అన్న వ్యాఖ్యలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**కుర్చీ ఎవరిని వరిస్తుందో?**

గోకవరం పంచాయతీ సర్పంచ్ పీఠం కోసం పోటీ పడుతున్న ఆశావహుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. అయితే చివరి వరకు ఎవరెవరు బరిలో నిలుస్తారు? ఎవరు ఎవరితో జతకడతారు? ఎలాంటి సమీకరణాలు మారుతాయి? అన్నది ఆసక్తికరంగా మారింది.

అభ్యర్థులు ఎంతమంది ఉన్నా.. అంతిమ తీర్పు మాత్రం ఓటరుదే.

ఈసారి ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారు?

గోకవరం పంచాయతీ కుర్చీ ఎవరిని వరిస్తుంది?

అన్న ప్రశ్నలకు ఎన్నికల ఫలితాల రోజే సమాధానం లభించనుంది.

### మండలంలోని సూరంపాలెం

# ఆయకట్టు రైతులకు ప్రత్యామ్నాయ సాగునీరు : బత్తుల

**లెనినో ప్రభావంతో అంతర్ పంటలను ఎన్నుకోవాలి : బొడ్డు - పామాయిల్ రైతులకు డ్రిప్పు,విద్యుత్ సౌకర్యం కల్పించాలి**




**కోరుకొండ, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** రైతులు వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి రైతు ఆర్థికంగా ఎదగాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయమని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం కోరుకొండ శ్రీదేవి ఫంక్షన్ హాల్ లో ఆత్మ కోరుకొండ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "కిసాన్ మేళా -వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన" కార్యక్రమాన్ని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలలో రైతులు పండించిన కూరగాయలు, వివిధ రకాల పప్పు దినుసులు, ఆకుకూరలు వంటి ఉత్పత్తులకు ఎటువంటి కెమికల్స్ లేకుండా పండించామని, తద్వారా ప్రజారోగ్యం పరిరక్షించబడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ సూరంపాలెం ఆయకట్టు ద్వారా మండలంలోని కనుపూరు రాజవరం గాదరాడ నరసాపురం గ్రామాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదని, దీనికి ప్రత్యామ్నాయంగా సూరంపాలెంను, పుష్కర లేదా పోలవరానికి త్వరలో అనుసంధానం చేసి సాగునీరు ఇస్తామన్నారు. పామాయిల్ రైతులకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్, విద్యుత్తు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ క్రాప్ట్ చేయించు కున్న రైతుల పంటలకు ఎటువంటి ఎరువులు కొరత ఉండదన్నారు. బొడ్డు మాట్లాడుతూ లెనినో ప్రభావంతో సాగునీటికి తీవ్ర ఎద్దడి ఏర్పడనుందని, రైతులు ప్రస్తుతం డిమాండ్ ఉన్న అంతర్ పంటల వైపు దృష్టి సారించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలనే వేయాలన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ వరిలో తక్కువ వ్యవధి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడినిస్తూ రైతుకు లాభం చేకూరుస్తున్న పి ఆర్ 126 ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాస్త్రవేత్తలు, పలు శాఖల అధికారులు రైతుల అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ, వ్యవసాయ పరంగా ప్రభుత్వ అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగించుకోవాల న్నారు. ప్రభుత్వ హామీతో పామాయిల్ వేసిన సన్న చిన్నకారు రైతులు డ్రిప్ ఇరిగేషన్ లేకపోవడం తీవ్ర అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు కంటే నాగ కేశవరావు, అడపా వీరబాబు, మేడిశెట్టి శివరాం, అడపా శ్రీనివాస్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులు సిహెచ్ శ్రీనివాస్, సిహెచ్ వి నరసింహారావు, వీరభద్రరావు, ఎస్ జయ రామలక్ష్మి, బి వెంకటేశ్వరరావు,డి శ్రీనివాసరావు,రిణి,రామ తులసి, గౌరీదేవి,వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

### కూటమి పాలనలో నిత్యావసర అధిక ధరలతో

# సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు

**రైతుకు మద్దతు ధర లేదు, ప్రజలకు బియ్యం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి**

**రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల సుధాకర్**



**మండపేట టౌన్, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ ఆరోపించారు. ఆరు నెలలు కష్టపడి పండించిన రైతన్నకు కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదని, అదే సమయంలో సామాన్యుడికి బియ్యం, నూనె, పంచదార, ఉల్లి, పెట్రోల్ ధరలు భారీగా పెంచి ప్రజలపై బాదుడు తో జీవనం దుర్భరం అవుతోందని ఆయన విమర్శించారు. సుధాకర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల గిట్టుబాటు ధర ఇవ్వలేకపోతూ, మరోవైపు మార్కెట్‌లో బియ్యం ధరలు రకాల వారీగా కేజీకి 15 నుంచి 20 రూపాయలు పెరిగాయని చెప్పారు. కొద్ది రోజుల్లోనే 26 కిలోల బస్తాకు 200 నుంచి 400 రూపాయల వరకు పెంచేసి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. ఎన్నికల్లో పేదలకు ఇంటింటికీ రేషన్ బియ్యం, సన్న బియ్యం అందిస్తామని హామీ ఇచ్చిన ఈ ప్రభుత్వం ఆ మాటను నిలబెట్టుకోలేక ప్రజలను మోసం చేసిందని ఆయన అన్నారు. నిత్యావసర వస్తువుల ధరల్లో వచ్చిన మార్పులను సుధాకర్ వివరించారు. గతంలో 45 రూపాయలున్న పంచదార ఇప్పుడు 75 రూపాయలకు చేరిందన్నారు. 900 గ్రాముల పామాయిల్ ప్యాకెట్ 95 రూపాయలుండగా ఇప్పుడు 155 రూపాయలు అవుతోందన్నారు. ప్రజలను మోసం చేయడానికి కొత్తగా 750 గ్రాముల ప్యాకెట్ 130 రూపాయలకు విడుదల చేశారని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వంలో 900 గ్రాముల ప్యాకెట్ 120 రూపాయలుండగా, ఇప్పుడు సన్‌ఫ్లవర్ 900 గ్రాముల ప్యాకెట్ 190 రూపాయలకు అమ్ముతున్నారని చెప్పారు. ఉల్లిపాయలు 60 రూపాయలు, పెట్రోల్ 117 రూపాయలు ఉండటంతో సామాన్య కుటుంబాలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రైతుకు ధాన్యం కొనుగోలులో మద్దతు లేకుండా, మార్కెట్‌లో వినియోగదారుడికి ధరలు పెంచి రెండు వైపులా ఇబ్బంది పెడుతున్నారని సుధాకర్ విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బియ్యం, నూనెలు, పంచదార వంటి నిత్యావసర వస్తువుల ధరలను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతోందని వ్యాఖ్యానించారు.

### చట్టాలపై ప్రతి ఒక్కరూ

# అవగాహన కలిగి ఉండాలి

**ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్**



**మండపేట టౌన్, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** ప్రజలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆలమూరు కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులు, చట్టపరమైన అంశాలపై అవగాహన పెంపొందించు కోవడం ద్వారా సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్‌లోని అల్ అమీన్ మస్జిద్ (చిన్న మసీదు) వద్ద శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది బెల్లపుకొండ దొరబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్జి ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని, న్యాయపరమైన హక్కులను తెలుసుకోవాలని సూచించారు.అనంతరం స్థానిక సీనియర్ న్యాయవాదులు తాళ్లపాటి విజయకుమార్, సుసర్ల సూర్యనారాయణ శాస్త్రి, దూలి జయరాజు, భీమన మహేశ్వరరావు, బెల్లపుకొండ దొరబాబు, ఆదిమూలం అబ్బులు నాయుడు తదితరులు ప్రజలకు పలు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు 200 మంది పాల్గొన్నారు.

### దోసకాయలపల్లి జిఎస్‌హెచ్ పాఠశాలలోని

# 44 మంది విద్యార్థులకు అస్వస్థత

**విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఎంపీ పురందేశ్వరి ఆరా**

**ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడండి– జక్కంపూడి**





**కోరుకొండ, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ మండలం దోసకాయలపల్లి జిఎస్‌హెచ్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో 44 మంది విద్యార్థిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో శనివారం జిల్లా వైద్యశాఖ, విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్, ఫుడ్ కంట్రోల్ అధికారులు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించి, విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. శనివారం సంఘటనపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారిణి కోమలి సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులకు దోసకాయలపల్లి ప్రాథమిక అధికారిణి డాక్టర్ ధరణి ఆధ్వర్యంలో మెరుగైన వైద్యాన్ని అందించారని పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందన్నారు. శుక్రవారం ఉదయం బజ్జి తీసుకున్నారని, మధ్యాహ్నం అరటి కాయల వేపుడు వంటి పదార్థాలు తీసుకోవడంతో సాయంత్రం 56 మంది విద్యార్థులకు విరోచనాలు, వాంతులు అవడంతో అస్వస్థత చేసిందన్నారు. వెంటనే వైద్యసిబ్బంది రంగలోకి దిగి, విద్యార్థులకు శుక్రవారం రాత్రి వరకు వైద్య సేవలు అందించడం పరిస్థితి మెరుగుపడిందన్నారు. సంబంధిత శాఖల అధికారులు విచ్చేసి నమూనాలు సేకరించారని, వివరాలు తెలియజేస్తామన్నారు. ఈ సంఘటనపై రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి, జిల్లా వైద్యాధికారిణి కోమలితో విద్యార్థులు ఆరోగ్య పరిస్థితిపై చరవాణి ద్వారా ఆరా తీసి, పరిస్థితిని చక్కదిద్దాలని ఆదేశించారు. వైయస్ఆర్సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా సంఘటన స్థలాన్ని సందర్శించి, బాధిత విద్యార్థులతో సంఘటనపై ఆరా తీశారు. భవిష్యత్తులో మరలా ఇటువంటి సంఘటన పునరావృతం కావాలంటే తగిన శ్రద్ధ కనబరచాలని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి కోమలి, ఫుడ్ సేఫ్టీ అధికారి సాయి తేజ, ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, తాసిల్దార్ సునీత, ఆర్ ఐ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు, ఎంఈఓ కుశ లోవదొర, జడ్పిటిసి కర్రి నాగేశ్వరరావు, సెక్రెటరీ మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి తెలుగువాడు గిడుగును ఆదర్శంగా తీసుకోవాలి : పెనకటి



**కోరుకొండ, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** ప్రతి తెలుగువాడు తెలుగు భాషాభివృద్ధికి తప్పనిసరిగా స్వర్గీయ గిడుగు వెంకట రామ్మూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ అధినేత పెనకటి గంగాధర్ అన్నారు. శనివారం తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన స్వర్గీయ గిడుగు వెంకట రామ్మూర్తి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ "తెలుగు పలికితే కురుస్తాయి తేనెల చినుకులు" వంటి అద్భుతాలు మన తెలుగు భాషలోనే సాధ్యపడతాయన్నారు. గిడుగు తెలుగును తప్పనిసరిగా వ్యవహారిక భాషగానే వాడాలని, తెలుగు సవర తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషికి 1993లో మద్రాస్ ప్రభుత్వం "రావు సాహెబ్" అవార్డు సగౌరవంగా అందించిందన్నారు. ఆయన కృషి ఫలితంగానే తెలుగు భాష ప్రతి సామాన్యులకు అర్థమవుతుందని, పరిపాలన, విద్య, పత్రికా రంగాల్లో పెను మార్పులు చోటుచేసుకుని తెలుగు భాష మరింత సరళీకృతం అయిందన్నారు. తెలుగు భాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి తెలుగువాడి పై ఉందని, ప్రతి ఒక్కరు మాతృభాషగా తెలుగుతో పాటు వ్యవహారిక ద్వితీయ భాషగా కూడా తెలుగునే తప్పనిసరిగా ప్రతిపాదించాలన్నారు. లేనిపక్షంలో భారత ప్రభుత్వ దృష్టిలో తెలుగు భాష తెరమరుగు కానుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ విద్యా నికేతన్ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల ఆదరభిమానానికి ప్రతీక రాఖీ పండుగ



**కోరుకొండ, ఆగస్టు 29, విశ్వం వాయస్ న్యూస్ :** అన్నాచెల్లెళ్ల ఆత్మీయత, ఆదరాభిమానలకు ప్రతీకగా నిలిచే "రాఖీ పండుగ"ను అన్నా చెల్లెల్లు అక్క తమ్ముళ్లు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకు న్నారు. రాఖీ పండుగ సందర్భంగా చెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి, వారు సుఖశాంతులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అన్నదమ్ములు తమ సోదరీ మణులకు దీవెనలు అందజేస్తూ, ఆప్యాయత అనురాగాలతో నిలయమై, సుఖశాంతులతో వెలుగొందాలని ఆశీర్వదించారు.రాఖీ కట్టడం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాకుండా, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే అందమైన వేడుకగా భావిస్తారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు ఒకరినొకరు పలకరించుకోవడం, కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేయడంతో ఇళ్లలో రాఖీపండుగ వాతావరణం నెలకొంది.

# విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**పోక్సో, సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పించిన సీఐ**



**రాయవరం, ఆగస్టు 29, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు చిన్న వయసులోనే చెడు స్నేహాలు, మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగానికి అలవాటుపడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు సూచించారు. శనివారం మండల కేంద్రమైన రాయవరంలోని శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. శాంతి సునీత సమక్షంలో విద్యార్థులకు పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దొరరాజు, రాయవరం ఎస్సై డి. సురేష్ బాబు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఆన్‌లైన్ పరిచయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా, అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. బాలలపై వేధింపులు, సైబర్ నేరాలు లేదా మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమస్య ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి. సాయన్న, ఇతర ఉపాధ్యాయులు, ఏఎస్ఐ వెంకట రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# దుమ్మురేపుతున్న యెష నాగుల సాంగ్..


## షేక్ అవుతున్న యూట్యూబ్



నేచురల్ స్టార్ నాని, కీర్తి సురేష్ నటించిన 'ది ప్యారడైజ్' నుంచి మోస్ట్ ఎవైటెడ్ సెకండ్ సింగిల్ 'యెష నాగుల' సాంగ్ రిలీజ్ అయ్యింది. ఫోక్ బీట్స్, మాస్ హీట్ అలాగే ప్యూర్ యూఫోరియాతో అదిరిపోయే రెస్పాన్స్ వస్తుంది. ఈ సాంగ్ యూట్యూబ్ ను షేక్ చేస్తుంది. నేచురల్ స్టార్ నాని పాన్ ఇండియా యాక్షన్ ఎక్స్‌ట్రావ్యాగెంజా 'ది ప్యారడైజ్' ఇప్పటికే పోస్టర్స్, ఫస్ట్ సింగిల్ 'ఆయా షేర్', ఇటీవల విడుదలైన టీజర్‌తో భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. 'ఆయా షేర్' కు వచ్చిన అద్భుతమైన స్పందన తర్వాత మేకర్స్ 'యెష నాగుల' తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. జానపద బాణీకి అనిరుధ్ తనదైన హై-ఎనర్జీ మ్యూజిక్‌ను జోడించిన ఈ పాటను డల్లాస్‌లో జరిగిన అనిరుధ్ కాన్సర్ట్‌లో లైవ్‌గా విడుదల చేశారు. వేలాది మంది అభిమానుల మధ్య పాటను లైవ్‌లో ప్రదర్శించగా, ప్రేక్షకులు డ్యాన్స్ చేస్తూ, కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకోవడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఈ పాటలో ప్రధానంగా ఆకట్టుకునేది తెలిసిన జానపద బాణీకి కొత్తదనాన్ని జోడించిన విధానం. ఇప్పటికే పాపులర్ అయిన ఫోక్ నంబర్‌కు అనిరుధ్ మరింత గ్రాండ్, సినిమాటిక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ఎనర్జిటిక్ పర్కషన్, వైబ్రెంట్ ఇన్‌స్ట్రుమెంటేషన్, రిథమిక్ లేయర్స్‌తో పాటకు పవర్‌ఫుల్ కాంటెంపరరీ ఫీల్ తీసుకొచ్చారు. అదే సమయంలో పాటలోని నేటివ్ ఫ్లేవర్ ఎక్కడా తగ్గకుండా జాగ్రత్త తీసుకున్నారు. కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ పాట మూడ్‌కు పర్ఫెక్ట్‌గా సరిపోయాయి. లైవ్లీగా, క్యాచీగా సాగుతూ పక్కా జానపద నేటివిటీని ప్రజెంట్ చేశాయి. జంగి రెడ్డి వోకల్స్ పాటకు అథెంటిక్ రస్టిక్ టచ్‌ను అందించగా, ప్రభా తన వోకల్స్ పాటలోని ఎనర్జీని మరింత పెంచారు. ఆట సందీప్ రిథమ్‌కు అనుగుణంగా ఫోక్ మూవ్‌మెంట్స్, మాస్ డ్యాన్స్ స్టెప్స్‌ను మేళవిస్తూ కొరియోగ్రఫీ అందించారు. పాటను కలర్‌ఫుల్‌గా, ఎనర్జిటిక్‌గా ప్రజెంట్ చేయడంతో మ్యూజిక్‌తో పాటు విజువల్‌గానూ మంచి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తోంది. ఈ పాటలో నాని ప్రధాన ఆకర్షణగా నిలిచారు. పూర్తి ఎనర్జీతో నాని చేసిన పెర్ఫార్మెన్స్ ఆకట్టుకుంటుంది. నాని డ్యాన్స్‌లో ఎనర్జీ, స్టైల్, యాటిట్యూడ్ కనిపిస్తాయి. రిథమ్‌కు తగ్గట్టుగా నాని వేసిన మాస్ స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాటలో ఆయన స్క్రీన్ ప్రెజెన్స్‌కు కావాల్సిన స్టార్ పవర్‌ను అందించారు. కీర్తి సురేష్ నాని ఎనర్జీకి పర్ఫెక్ట్ కాంప్లిమెంట్‌గా నిలుస్తూ విజువల్స్‌కు మరింత చార్మ్‌ను జోడించారు. వీరిద్దరి కాంబినేషన్ డ్యాన్స్ పోర్షన్స్‌కు మరింత ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా ఈ పాట సినిమాను దాటి ప్లేలిస్టులు, సెలబ్రేషన్స్, పార్టీల్లోనూ తనదైన స్థానం సంపాదించుకోనుంది.

# ఆయన తినే రైస్ మనం తినలేము

## నాగార్జున డైట్ రివీల్ చేసిన మేకప్ ఆర్టిస్టు..



నాగార్జున అద్భుతమైన లైఫ్‌స్టైల్, ఆహార అలవాట్లు, ఫిట్‌నెస్, హెయిర్ సీక్రెట్స్‌ను మేకప్ మ్యాన్ చంద్ర వెల్లడించారు. మితంగా తినడం, దంపుడు బియ్యం, బెండకాయ, పాంప్లెట్ చేపల ఆహారం, నిమ్మ, ఉసిరి, క్యారెట్, బీట్‌రూట్ జ్యూస్, రోజూ జిమ్ ఆయన ఆరోగ్య రహస్యాలు. ఈ క్రమశిక్షణ ఆయనను నిత్యయవ్వనంగా ఉంచుతుందని చంద్ర వివరించారు. చిత్ర పరిశ్రమలో బతికినంత కాలం కింగ్ నాగార్జున లాగా బతకాలి అని ఎంతోమంది హీరోలు కోరుకుంటుంటారు. ఆయన రిచ్‌నెస్ పక్కన పెడితే, ఆయన లైఫ్‌స్టైల్, శారీరక నిర్మాణం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తాయి. నాగార్జునగారి వ్యక్తిగత మేకప్ మ్యాన్ చంద్ర, ఆయన ఆహార, ఆరోగ్య రహస్యాలను, ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ఇటీవల ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో వివరంగా పంచుకున్నారు. నాగార్జున ఆహారం విషయంలో అత్యంత క్రమశిక్షణతో ఉంటారని చంద్ర వెల్లడించారు. ఆయన వారంలో ఐదు రోజులు మామూలు ఆహారాన్నే తీసుకుంటారు, కానీ "మితంగా తీసుకోవాలి" అనే సూత్రాన్ని పాటిస్తారు. ఎక్కువగా తినరు. ఉదయం అల్పాహారంలో ఒక ఇడ్లీ, లేదా ఒక వడ, లేదా ఒక గారె మాత్రమే తీసుకుంటారని తెలిపారు. మళ్ళీ ఆకలి వేసినప్పుడే తింటారని, ఆకలి లేనిదే తినరని స్పష్టం చేశారు. చాలా మంది లాగా ఆకలి ఉన్నా లేకపోయినా దొరికింది తినేయరని చంద్ర వివరించారు. మధ్యాహ్న భోజనంలో నాగార్జునగారికి కొన్ని ప్రత్యేకమైన వంటకాలు తప్పనిసరిగా ఉండాలి. రోజూ బెండకాయ, హాట్ చిప్స్ ఆయన డైట్‌లో ఉంటాయి. అన్నం విషయంలో దంపుడు బియ్యం (పొట్టు తీయనివి) మాత్రమే తింటారు. ఇవి పాత రోజుల్లో తినే పద్ధతికి దగ్గరగా ఉంటాయని చంద్ర పేర్కొన్నారు. అన్నం చాలా మెత్తగా, దాదాపు చివిడిపోయినట్లు ముద్దగా ఉండాలని ఆయన కోరుకుంటారని, అది అందరూ తినలేరని చంద్ర నవ్వారు. దంపుడు బియ్యంతో పాటు రసం, ఒక అరటిపండు కూడా ఆయన ఆహారంలో భాగం. ఇవన్నీ కూడా తక్కువ మోతాదులోనే తీసుకుంటారని వివరించారు. శనివారం రాత్రి నుండి నాగార్జునగారికి ఇష్టమైన ఆహారం పాంప్లెట్ చేప అని చంద్ర వెల్లడించారు. అవుట్‌డోర్ షూటింగ్స్‌కు వెళ్ళినప్పుడు, ముఖ్యంగా కేరళ వంటి ప్రాంతాలకు వెళ్ళినప్పుడు, తాను స్వయంగా ఆయనకు పాంప్లెట్ చేపలను వండి పెట్టేవాడినని చంద్ర తెలిపారు. తెలుగులో దీన్ని చందువ చేప అని కూడా అంటారని పేర్కొన్నారు. నాగార్జున ఒకటికి రెండు చేపలు కూడా తింటారని, అది ఆయనకు చాలా ఇష్టమైన వంటకమని వివరించారు. సన్నగా తరిగిన వెల్లుల్లి, అల్లం, మిరియాలు, ఆలివ్ ఆయిల్‌లో నానబెట్టి, ఆ మిశ్రమాన్ని చేపలపై వేసి తయారుచేస్తారు. పసుపు, మామూలు అల్లం వెల్లుల్లి పేస్టు వంటివి వాడరని చెప్పారు. ఆదివారం నాడు మటన్ లేదా చికెన్ కూడా తీసుకుంటారు, కానీ రెండు లేక మూడు ముక్కలకు మాత్రమే పరిమితం చేస్తారని తెలిపారు. ఆదివారం మాత్రం కొద్దిగా ఎక్కువ తింటాడేమో అని చంద్ర అభిప్రాయపడ్డారు. నాగార్జునగారు ప్రతిరోజూ జిమ్ చేస్తారు. ఇది ఆయన దినచర్యలో ముఖ్య భాగం. జిమ్‌తో పాటు, ఆయన యవ్వన రూపానికి, ముఖ్యంగా జుట్టు రాలకుండా ఉండటానికి ఒక ప్రత్యేకమైన జ్యూస్ తాగుతారు. షూటింగ్‌కు రాగానే పరగడుపున ఒక పెద్ద రాగి గ్లాసులో ఈ జ్యూస్‌ను చంద్ర స్వయంగా తయారుచేసి ఇచ్చేవారు. ఈ జ్యూస్‌లో నిమ్మకాయ, ఉసిరికాయ, క్యారెట్, బీట్‌రూట్, అలాగే పటికబెల్లం ముక్క లేదా తేనె కలిపి మిక్సీ చేస్తారు. ఈ జ్యూస్ జుట్టు రాలకుండా ఉండటానికి ప్రధాన రహస్యమని, అన్నమయ్య సినిమాకు తప్ప ఆయన కెరీర్‌లో ఎప్పుడూ విగ్ వాడలేదని చంద్ర స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎవరికైనా ఈ జ్యూస్ తాగితే జుట్టు రాలదని, కానీ నాగార్జునగారు దీనిని నిరంతరం మెయింటైన్ చేస్తారు కాబట్టే ఆయన జుట్టు అద్భుతంగా ఉందని చంద్ర పేర్కొన్నారు.

# ఆసియా క్రీడలకు నీరజ్ చోప్రా దూరం



ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు. "ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది" అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

### వైభవ్ సూర్యవంశీ ప్రకటన..

# మనసున్నోడివయ్యా అంటూ ప్రశంసలు



వయసులో చిన్న అయినా .. ఆలోచనలో మిన్న అని నిరూపించుకున్నాడు భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ. భారత్ తరఫున అత్యంత పిన్నవయసులోనే అరంగేట్రం చేసి రికార్డు సృష్టించి.. దూకుడే తన మంత్రమంటూ సత్తా చాటాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకేస్తూ అభిమానులను ఆకట్టుకున్నాడు. విద్యార్థులకు సాయం చేసేందుకు ముందుకొచ్చాడు.

**నిన్న చెప్పాడు.. నేడు ప్రకటించాడు**

'గొప్ప విషయాలు రాబోతున్నాయి.. అలాగే చూస్తూ ఉండండి' అంటూ తన సోషల్ మీడియా ఖాతాలో వైభవ్ సూర్యవంశీ పోస్టు పెట్టాడు. ఏంటా.. అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా.. ఇవాళ ఉదయం ఓ ప్రకటన చేశాడు. "నాకు ఎక్స్ ప్లాట్‌ఫామ్ నుంచి వచ్చే ఆదాయాన్ని అవసరమైన విద్యార్థుల చదువుకు వెచ్చించాలని భావిస్తున్నా. అర్హత కలిగిన వారు సంప్రదించగలరు. పాఠశాల, కళాశాలకు సంబంధించి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారికి సాయంగా ఉంటా. నాకు తోచినరీతిలో మద్దతు ఇచ్చేందుకు ప్రయత్నిస్తా" అని వైభవ్ పోస్టు పెట్టాడు. దీంతో యువ క్రికెటర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. చిన్న వయసులోనే ఇంతటి గొప్ప ఆలోచన చేసినందుకు అభినందనలు అంటూ కామెంట్లు చేశారు.





# 51 ఏళ్ల వయసులో 'ఫైఫర్'..

## అంతర్జాతీయ మ్యాచ్‌లో అరుదైన రికార్డు




క్రికెట్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం కొత్తేమీ కాదు. కానీ, 51 ఏళ్ల వయసులో ఓ క్రికెటర్ ఈ ఫీట్ సాధిస్తే అద్భుతమే కదా.. అదీనూ అంతర్జాతీయ మ్యాచ్‌లో. ఈ ఘనతను 'ఐస్లే ఆఫ్ మ్యాన్' జట్టుకు చెందిన జోన్ హిక్స్ అనే మహిళా క్రికెటర్ సాధించింది. ఆటకు వయసుతో సంబంధం లేదని నిరూపించింది. రొమానియా వేదికగా మహిళల కాంటినెంటల్ కప్ జరుగుతోంది. అందులో గ్రీస్‌తో ఐస్లే తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన గ్రీస్ 15 ఓవర్లలో 52 పరుగులకే కుప్పకూలింది. జోన్ హిక్స్ 10 పరుగులను మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు (ఫైఫర్) తీసింది. ఆమె దెబ్బకు గ్రీస్ జట్టులోని ఒక్కరు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో ఐస్లే టీమ్ 6 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 56 పరుగులు చేసి విజయం సాధించింది.

**1932 నాటి రికార్డును అధిగమించి..**

ఇప్పటి వరకు పురుషుల, మహిళల క్రికెట్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన పెద్ద వయసు బౌలర్ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన బెర్ట్ ఐరన్‌మొంగర్ పేరిట ఉండేది. 1932లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆయన ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అప్పటికి ఆయన వయసు 49 ఏళ్లు. ఇప్పుడు జోన్ హిక్స్ 51 ఏళ్ల వయసులో ఆ రికార్డును బద్దలు కొట్టింది. తన 40వ ఏట మహిళా క్రికెట్‌లోకి అడుగు పెట్టిన హిక్స్ ఆఫ్ స్పిన్నర్‌గా పేరొందింది. ఇప్పటి వరకు 22 అంతర్జాతీయ టీ20ల్లో 33 వికెట్లు పడగొట్టింది.

# ఇమ్రాన్ ఖాన్ అవినీతిపరుడు కాదు..

## వదిలేస్తే ఏమవుతుంది?: మియాందాద్



అవినీతి కేసుల్లో దోషిగా తేలిన పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం రావల్పిండి జైలులో ఉన్నారు. అక్కడ ఆయనపై హత్యాయత్నాలు జరుగుతున్నాయంటూ ఇమ్రాన్ ఖాన్ కుమారులు ఓ ఇంటర్వ్యూలో సంచలన ఆరోపణలు చేశారు. మూడేళ్లుగా జైలులో నరకం అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యం కూడా క్షీణించినట్లు అంతకుముందు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో క్రికెట్ ప్రపంచం కూడా స్పందించింది. పాకిస్థాన్ మాజీ కెప్టెన్ అయిన ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. ఆయనకు ఒకప్పుడు సహచరుడైన జావెద్ మియాందాద్ పాక్ ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేశాడు. అదే సమయంలో తన మిత్రుడు అవినీతి పనులు చేసి ఉండడని వ్యాఖ్యానించాడు. "ఇమ్రాన్ ఖాన్ నిజాయతీపరుడే. అవినీతి పనులు చేసే వ్యక్తి కాదు. అలాంటివాడే అయితే ఇంకా ఎన్నో చేసేవాడు కదా. ఒకవేళ ఇప్పుడు ఇమ్రాన్‌ను వదిలేస్తే ఏం జరుగుతుంది? అతడు ఎవరికైనా హాని చేస్తాడా? అతడు కూడా ఒకరికి కుమారుడే. అతడు ఏం చేస్తుంటాడా? అని నేనెప్పుడూ ఆలోచిస్తూనే ఉంటా" అని జావెద్ మియాందాద్ వెల్లడించారు.

**ప్యాట్ కమిన్స్ కూడా..**

ఇమ్రాన్ ఖాన్‌కు మెరుగైన వైద్యం అందించాలని సునీల్ గావస్కర్, గ్రెగ్ ఛాపెల్‌తో సహా దాదాపు 21 మంది మాజీ కెప్టెన్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు లేఖ రాశారు. ఈ క్రమంలో ప్యాట్ కమిన్స్ కూడా తన మద్దతును తెలియజేశాడు. "గ్రెగ్ ఛాపెల్‌తోపాటు మాజీ సారథులందరికీ మద్దతు ఇస్తున్నా. కోర్టు ఆదేశించిన వైద్య పరీక్ష పూర్తి అయ్యేలా అనుమతించాలని సూచిస్తున్నా. అలాగే కుటుంబ సభ్యులను చూసేందుకు అనుమతించాలి. ఇమ్రాన్ ఖాన్‌కు దక్కాల్సిన కనీస గౌరవ మర్యాదలను అందించాలని కోరుకుంటున్నా" అని కమిన్స్ పోస్టు చేశాడు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com